ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
3
సోమవారం 8 ఏప్రిల్ 2024





ఖాకీ + వైసీపీ = బరితెగింపు

- ప్రతిపక్ష పార్టీ నేతల కదలికలపై డేగకన్ను
- వైసీపీ కార్యకర్తల్లా.. ఓ సామాజిక వర్గ పోలీసులు
- ఐపీఎస్‌ల బదిలీతోనైనా పోలీసుల్లో మార్పు వచ్చేనా?

ఐపీసీని అమలు చేసి రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన పోలీసులు వైసీపీ సేవలో తరిస్తోన్నారన్న విమర్శలు, ఆరోపణలు వస్తున్నా కొందరు పట్టించుకోవడంలేదు. వైసీపీ కార్య కర్తలకంటే ఎక్కువగా పోలీసులు కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు బరి తెగిస్తున్నారు. సామాన్యుల నుంచి ప్రతిపక్ష నాయకుల వరకు వైసీపీ బాధి తులుగా మారుతున్నా పోలీసులు రక్షణ కల్పించకపోగా తిరిగి వారిపైనే కేసులు పెట్టి వేధి స్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చినా పోలీసుల తీరు మారుతుందని అందరూ ఆశించగా ఆ పరిస్థితులు మచ్చుకు కూడా కానరావడం లేదనేందుకు గత కొన్ని రోజులుగా ఎన్నో ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఈ క్రమంలో వైసీపీ చట్టాన్ని అమలు చేస్తున్న ఐపీఎస్‌లపై బదిలీ వేటు పడటం పోలీస్ శాఖలో తీవ్ర కలకలం రేపింది. ఒక్క గుంటూరు రేంజ్‌లోనే ఏకంగా నలుగురు ఐపీఎస్‌లపై వేటు పడిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఉన్నతాధికారులపై వేటు పడిన నేపథ్యంలో క్షేత్రస్థాయి సిబ్బందిలో మార్పు వస్తుందా..? అధికార పార్టీ నేతల సేవలో తరిస్తున్న కొంతమంది ఖాకీల ప్రవర్తనలో ఇప్పటికైనా మార్పు వచ్చేనా..? అనే సందేహాలు అటు పోలీసుల్లోనూ, ఇటు ప్రతిపక్ష పార్టీల్లోనూ సర్వత్రా వినిపిస్తున్నాయి.

రిగ్గింగ్‌కు వైసీపీ వ్యూహం

ఎన్నికల కమిషన్‌కు టీడీపీ ఫిర్యాదు

గిరిజనులు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఇప్పటికీ లేదు. ఇదేదో మారుమూల జిల్లాల్లో కాదు పల్నాడు ప్రాంతంలోని పలు తండాల్లో ఈ పరిస్థితి ఉంది. మైదాన ప్రాంత గిరిజనులు అధికంగా ఉండే పల్నాడు జిల్లాలోని మాచర్ల నియోజక వర్గంలోని అనేక తండాల్లో వైసీపీ నేతల అరాచకం రాజ్యమేలుతోంది. పోలింగ్ సమయంలో బూత్‌ల ఆక్రమణ, రిగ్గింగ్ ఆయా తండాల్లో షరామామూలుగా మారింది. లేదంటే వారిని భయభ్రాంతులకు గురి చేసి ఓటు వేయించుకుంటున్నారు. అయితే ఈ దఫా ఎలాగైనా తాము ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో మాచర్ల నియోజకవర్గంలోని దుర్గి, వెల్దుర్తి, మాచర్ల మండలాల్లో ఏఏ తండాల్లో ఎన్ని ఓట్లు ఉన్నాయి, అక్కడి గిరిజనుల పరిస్థితులను వివరిస్తూ, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలని టీడీపీ నేతలు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించారు. గిరిజనులు వారికి నచ్చిన పార్టీకి ఓటు హక్కును వినియోగించులేక పోతున్నారని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సారి కూడా బలవంతంగా ఓటు వేయించుకోవడమో లేదంటే బూత్‌లు ఆక్ర మించి రిగ్గింగ్‌కు పాల్పడడమో చేసేందుకు వైసీపీ నేతలు ఇప్పటికే పక్కా పథకం రూపొందించారని ఆయా గ్రామాల్లో గిరిజనులు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా వారికి తగిన రక్షణ కల్పించాలని, పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు విజ్ఞప్తి చేశారు. వెల్దుర్తి మండలం కొత్తపుల్లారెడ్డి గూడెం, రామచంద్రాపురం తండా, మరస పెంట, హనమాపురం తండా, పిచ్చయ్య బావి తండా, దావుపల్లి తండా, మాచర్ల మండలం అచ్చమ్మకుంటతండా, రేగులవరంతండా, లచ్చమ్మబావి తండా, హస్నాబావితండా, కొత్తూరు, చింతల తండా, దుర్గి మండలం మంగాపురం తండా, లక్ష్మీపురం తండా, నెహ్రూ తండాల్లో బూత్‌ల ఆక్రమణ, రిగ్గింగ్ జరిగే అవకాశం ఉందని ఎన్నికల సంఘానికి తెలిపారు.

- ఇటీవల జగమేశ్వరపాడు వద్ద జనసేన కార్యకర్తలపై వైసీపీ వర్గీయులు దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడితే పోలీసులు బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అదే టీడీపీ, జనసేన కార్యకర్తలు దాడికి పాల్పడితే వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయడమే గాక సంబంధం లేని గ్రామంలోని పార్టీ కార్యకర్తలపై కేసులు నమోదు చేసి జైళ్లకు పంపేవారని పార్టీ నేతలే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- డెల్టా ప్రాంతంలో పోలీసులు వైసీపీకి పరోక్ష సహకారం అందిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల కొల్లిపర స్టేషన్ పరిధిలోని మున్నంగి గ్రామంలో ఇసుక రీచ్ వద్ద తవ్వకాలు ఆపాలని గొడవ చేసిన ఉదంతంలో ఆందోళనకు దిగిన వారిని ట్రాక్టర్‌తో తొక్కించి, కత్తులతో పొడిచేందుకు యత్నించిన ఘటనపై ఎస్ఐ కేసు లేకుండా రాజీ ప్రయత్నం చేశారు.

- కొల్లూరు మండల పరిధిలోని కిష్కింధపాలెంలో కోడ్ అమలు విషయాన్ని ప్రశ్నించిన పాపానికి టీడీపీ సానుభూతిపరులపై ఇటీవల వైసీపీ శ్రేణులు దాడికి తెగబడగా బాధితుడి మీదే పోలీసులు కేసు నమోదు చేశారన్న విమర్శలున్నాయి. వైసీపీ ఇన్‌చార్జి ఇటీవల భట్టిప్రోలు తహసీల్దార్ కార్యాలయంలో వ్యవహరించిన తీరుపై కూడా పోలీసులు కిమ్మనలేదు. బల్లికురవ ఎస్ఐ నాగశివారెడ్డి ఏకంగా టీడీపీ సానుభూతిపరుడైన ఓ వృద్ధుడిపై చేయిచేసుకున్నాడు. ఇవన్నీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక జరిగిన ఘటనలు కాగా అంతకు ముందు పలు సందర్భాల్లో పోలీసులు వైసీపీ నేతల సేవలో తరించారు. గతంలో చీరాల అధికార పార్టీలోని ఇరు వర్గాల మధ్య జరిగిన గొడవలో ఓ నేత గన్‌మెన్ ఏకంగా ఏఎస్పీ పైనే అనుచితంగా ప్రవర్తించారనే ప్రచారం అప్పట్లో జోరుగా సాగింది. ఈ ఘటనమీద విచారణ జరపడంగాని, బాధ్యులైన వారిమీద చర్యలు తీసుకోవడం గాని జరగలేదు.

వారిని మార్చకుండా ఎన్నికలు కష్టమే...

బరితెగించి వ్యవహరిస్తున్న అనేకమంది సీఐలు, ఎస్ఐలను మార్చకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడం కష్టమనే వాదనలు ఉన్నాయి. ముఖ్యంగా పల్నాడులో ప్రశాంత ఎన్నికలు ఈ దఫా కత్తిమీద సామేనని సర్వత్రా ఆందోళనలున్నాయి. ఇప్పటికే అధికార పార్టీతో మ్యాచ్‌ఫిక్స్ చేసుకున్న సీఐలు, ఎస్ఐలను మార్చకుండా ఎన్నికల ప్రక్రియను సజావుగా ముగించలేరనే విషయం ఎస్పీ ముందుగా గుర్తించాల్సి ఉంది.

గుంటూరు, ఏప్రిల్ 7: చట్టాన్ని పరిరక్షిస్తూ, శాంతిభద్రతలను కాపాడుతూ, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాల్సిన పోలీసులు ఉద్యోగ ధర్మాన్ని విస్మరించి అధికార పార్టీ సేవలో తరిస్తున్నారు. గడిచిన నాలుగున్నరేళ్లకు పైగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి. ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు కదిలితే కేసు.. మాట్లాడితే అరెస్టు అన్నట్లుగా కొందరు పోలీసుల తీరు ఉంది. తప్పుడు కేసులు, అక్రమ అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేశారు. పోలీస్‌స్టేషన్లు వైసీపీ కార్యాలయాల మాదిరిగా.. అక్కడ ఖాకీలు వైసీపీ రక్షకభటులు మాదిరిగా తయారయ్యారనేలా పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసు చర్యలతో ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ రోడ్డు మీదకు వచ్చే సాహసం కూడా చేయలేకపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజును లాఠీలతో చితక్కొట్టిన ఉదంతానికి వేదిక కూడా గుంటూరే కావడం గమనార్హం. ఎన్నికల కోడ్‌తోనైనా అధికారుల్లో మార్పు వస్తుందని, కనీసం ఏకపక్ష వైఖరి విడనాడతారని భావించారు. కానీ ఎన్నికల షెడ్యూల్ విడుదలై రెండు వారాలు గడిచినా ఇప్పటికీ కొందరు పోలీస్ అధికారుల్లో మార్పు లేదు. అనేక పోలీస్‌స్టేషన్లలో ఎస్‌హెచ్‌వోలు ఏకపక్ష వైఖరి అవలంబిస్తూనే ఉన్నారు. ముఖ్యంగా ఓ సామాజిక వర్గానికి చెందిన వారు రానున్న ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల విజయాన్ని తమ భుజాలపై వేసుకున్నట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే ప్రభుత్వం అనుకూలమైన వారిని పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేసుకుంది. ఎన్నికల్లో కీలకపాత్ర వహించే పోలీసులు పక్షపాతంగా వ్యవహరించకుండా ప్రతిపక్ష నాయకులు వారిపై ఓ కంట కన్నేసి ఫిర్యాదులు చేసేవారు. దీంతో పోలీసుల ప్రవర్తనలో మార్పు వచ్చేది. కానీ ప్రస్తుతం అటువంటి పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదనే వాదన ఉంది. ఉన్నతాధికారులే గుడ్డిగా అధికార పార్టీకి దాసోహం అన్నట్లుగా వ్యవహరిస్తుంటే క్షేత్ర స్థాయిలో సిబ్బంది మరోలా ఎలా వ్యవహరిస్తారనే వాదన ఉంది. గత నెల 17న చిలకలూరి పేట బొప్పూడిలో ప్రధాని మోదీ పాల్గొన్న ప్రజా గళం సభ సజావుగా సాగేలా భద్రత కల్పించాల్సిన పోలీసు అధికారులే కార్యక్రమ విఘాతానికి సహకరించారన్న ఆరోపణలున్నాయి. దీంతో ఐపీఎస్‌లపై ఎన్నికల కమిషన్ కొరడా ఝుళిపించింది. గుంటూరు రేంజి ఐజీ జి.పాలరాజు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు ఎస్పీలు రవిశంకర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, కె.తిరుమలేశ్వరరెడ్డిలపై బదిలీ వేటు వేయడం పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. వారిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్ ఆదేశించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో..

గతంలో మాచర్ల, గురజాల నియోజకవర్గాలు ఫ్యాక్షన్ ప్రభావితంతో అతలాకుతలం అయ్యేవి. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో దాదాపుగా ఫ్యాక్షన్ కనుమరుగైనప్పటికీ రాజకీయ కక్షలు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. అక్కడ పోలీసులు పుండు మీద కారం చల్లినట్లుగా వైసీపీకి కొమ్ముకాస్తూ ఆయా గొడవలకు ఆజ్యం పోస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పిడుగురాళ్ల, మాచవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో టీడీపీ కార్యకర్తలపై సీఐలు వేధింపులకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో టీడీపీ కార్య కర్త లపై తప్పుడు కేసులు బనాయించడం, పార్టీలో చురుగ్గా ఉండే వారిని స్టేషన్‌కు పిలిపించి కేసులు బనాయిస్తామని, రౌడీషీట్‌లు తెరుస్తామని బెదిరించడం షరా మామూలుగా మారింది. పోలీసులే వైసీపీ నాయకులను పిలిపించి వారి నుంచి ఫిర్యాదు తీసుకుని టీడీపీ నాయకులను స్టేషన్ల చుట్టూ తిప్పుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఎన్నికల సమయంలో కనీసం వారిని ఏజెంట్లుగా కూడా కూర్చోకుండా చూసేందుకు పోలీసులు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు.

- గుంటూరులో ఇటీవల బదిలీలపై వచ్చిన వారిలో ఎక్కువ మంది ప్రస్తుతానికి వైసీపీ శ్రేణులకు పరోక్ష సహకారమే తప్ప ప్రత్యక్షంగా సహకరించే పరిస్థితి లేదు. నగరంలోని ఓ పోలీస్‌స్టేషన్‌కు చెందిన సీఐపై వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కోడ్‌కు ముందు నుంచి ఆయన వైసీపీ నేతలతో కలిసి తిరగడం, వారు ఏది చెబితే అది చేయడం విధిగా పెట్టుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కేవలం రాజకీయ కక్ష సాధింపులో భాగంగా మూడేళ్ల క్రితం రాజధాని ఉద్యమానికి సంబంధించి నమోదైన కేసులను బయటకు తీసి ఇప్పుడు వారికి నోటీలును ఇస్తుండటంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

- కారంపూడి పోలీస్‌స్టేషన్‌లో వైసీపీ నేతలు ఏది చెప్తే అదే జరుగుతుంది. ఇటీవల కారంపూడిలోని ఓ స్టాల్ వద్ద ఉన్న టీడీపీ నేత చప్పిడి రాముపై సీఐ చిన మల్లయ్య ఏకంగా సర్వీసు రివాల్వర్‌తో దాడికి పాల్పడటం కలకలం రేపింది. మండలంలోని మిరియాలతో పాటు అనేక గ్రామాల్లో సీఐ చిన్న మల్లయ్య, ఎస్ఐ రామాంజనేయులును అడ్డుపెట్టుకుని వైసీపీ నాయకులు రిగ్గింగ్‌కు పథకం రూపొందించినట్లు ప్రచారం జరుగుతోంది.

- గడిచిన ఆరునెలలుగా వెల్దుర్తి మండలం గొట్టిపాళ్ల గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు గ్రామం విడిచి వేర్వేరు ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారు. మిగిలిన వారిని బలవంతంగా వైసీపీలో చేర్చుకున్నారు. కాగా గ్రామానికి చెందిన కొందరు దళితులు టీడీపీపై ఉన్న అభిమానంతో గత నెల 17న బొప్పూడి ప్రజాగళం సభకు రహస్యంగా వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన వైసీపీ వర్గీయులు సభకు వెళ్ళిన వారు తిరిగి గ్రామానికి చేరకముందే గ్రామంలోని వారి ఇళ్లపై దాడులకు పాల్పడ్డారు. దీంతో గడిచిన 20 రోజులుగా ఆ గ్రామానికి చెందిన దళితులు గ్రామం వెలుపలే తలదాచుకుని ఇటీవలే గ్రామంలోకి అడుగు పెట్టారు.

వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో నేటికీ టీడీపీ కార్యకర్తలు వేర్వేరు ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారు. రెండేళ్లుగా అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ శ్రీహరి వైసీపీ కార్యకర్త మాదిరిగా వ్యవహరిస్తున్నారని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. టీడీపీకి చెందిన మత్స్యకారుడు దుర్గారావును వైసీపీలో చేరాలని లేదంటే తప్పుడు కేసులు బనాయిస్తానని ఎస్ఐ వేధించడం వల్లే ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.



టీడీపీ కార్యకర్తలపై దాడి (పాతచిత్రం)



ఇటీవల కారంపూడిలో సీఐ చినమల్లయ్య రివాల్వర్‌తో టీడీపీ నేతకు బెదిరింపు

పల్నాడులో పోలీసులే అసలు సమస్య

పల్నాడులో ప్రశాంత ఎన్నికలకు పోలీసులే అడ్డంకిగా మారారన్న ఆరోపణలున్నాయి. ఆ ప్రాంతంలో వైసీపీ అభ్యర్థులను గెలిపించడం కోసం ఆ పార్టీ నాయకుల కంటే పోలీసులే తీవ్రంగా ప్రయత్నిస్తున్నారన్న విమర్శలున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు చెప్పిందే చట్టం.. చేసిందే శాసనం అన్నట్లుగా కొందరు పోలీసులు తూచా తప్పకుండా అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో టీడీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు, వేధింపులు, బెదిరింపులకు పాల్పడుతున్నారు. రెండేళ్లుగా ఒకే స్టేషన్ పరిధిలో ఉంటున్న ఎస్ఐలు, సీఐలు పలువురు రెచ్చిపోతూ టీడీపీ కార్యకర్తలపై ఉక్కుపాదం మోపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పెదకూరపాడు నియోజకవర్గంలో తమ నేతలపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఇటీవల అమరావతి మండలం ధరణికోటలో వైసీపీ కార్యాలయానికి నిప్పుపెట్టిన ఘటనతో సంబంధం లేని ముగ్గురు టీడీపీ నేతలపై కేసులు బనాయించారు. కేసుతో సంబంధం లేని టీడీపీ నాయకులు కంచేటి సాయికుమార్, దండా నాగేంద్ర, షేక్ జానీ బాషాలను నిందితులుగా చేర్చారు. దీనిపై టీడీపీ నేతలు హైకోర్టులో సవాలు చేయగా ప్రస్తుతానికి అరెస్టు నుంచి మినహాయించారు. అయితే సాయికుమార్ విదేశాలకు వెళ్తున్నాడనే కారణంతో మహారాష్ట్రలో ఇటీవల పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం విదితమే. అమరావతిలో ఇటీవల వైసీపీ కార్యకర్త టీడీపీలోకి చేరేందుకు సిద్ధమైన విషయం తెలుసుకున్న అమరావతి సీఐ బ్రహ్మం ఆయనతో వివాదం ఉన్న వ్యక్తిని పిలిపించి ఫిర్యాదు తీసుకుని అరెస్టు చేస్తానని బెదిరించారంటే వారి పనితీరు తెలుసుకోవచ్చు. ఈ విధంగా పోలీసు అధికారులు ఎక్కడికక్కడ వైసీపీ నేతలు చెప్పిందే వేదంగా నడుచుకుంటూ టీడీపీ కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తున్నారని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.27(సోమవారం)
సహరీ (ఉదయం) 4.40 (మంగళవారం)



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

- సత్తెనపల్లి నియోజక వర్గ నేతలతో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, ఎంపీ కృష్ణదేవరాయలు



గెలుపే లక్ష్యం కావాలి

- ఉమ్మడి నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం
- అలసత్యం వద్దు.. అప్రమత్తంగా ఉండాలి
- టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిదే అధికారం
- మళ్లీ వైసీపీ వస్తే నార్త్ కొరియాలా ఆంధ్రప్రదేశ్
- లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థుల సమీక్షలో టీడీపీ అధినేత

నరసరావుపేట, సత్తెనపల్లి, ఏప్రిల్ 7: కూటమి అభ్యర్థులు విజయం సాధించాలి. గెలుపే లక్ష్యంగా నేతలు, కార్యకర్తలు పనిచేయాలి. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి వస్తుంది. ఏ మాత్రం అలసత్వం వహించినా నష్టపోతాం. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం నార్త్ కొరియాలా మారిపోతుంది. అందుకే అందరూ ఎన్నికలపై అప్రమత్తంగా వ్యవహరించాలి.. అని ఉమ్మడి పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రజాగళం సభల్లో భాగంగా రాత్రి బస చేసిన టీడీపీ అధినేత సత్తెనపల్లిలో ఆదివారం నరసరావుపేట, గుంటూరు లోక్‌సభ పరిధిలో పోటీ చేసే అభ్యర్థులు, టీడీపీ, బీజేపీ, జనసేన ముఖ్య నేతలతో ఎన్నికలపై సమీక్షించారు. రానున్న 36 రోజులు ఎంతో కీలకమని, నేతలు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో కష్టపడి పడి పని చేసి అన్ని స్థానాల్లో కూటమి విజయ దుందుభి మోగించాలని తెలిపారు. జనసేన, బీజేపీ ఓట్లు బదిలీ అయ్యేలా చూడాలని నేతలకు సూచించారు. సూపర్ సిక్స్ పథకాలపై స్పందన బాగుందని, వీటిని మరింతగా ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. వైసీపీ దుష్టపాలనలో దిగజారిన రాష్ట్రాన్ని గాడిన పెట్టి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలంటే కేంద్రం మద్దతు తప్పనిసరని, ఈ క్రమంలోనే పొత్తు పెట్టుకోవాల్సి వచ్చిందన్న విషయాన్ని ప్రజలకు అభ్యర్థులు, నేతలు వివరించి చెప్పాలన్నారు. పింఛన్ల పంపిణీలో వృద్ధులను ఇబ్బంది పెట్టి టీడీపీపై బురద చల్లుతున్న వైసీపీ తీరును ప్రజల ముందు ఎండగట్టి వాస్తవాలు చెప్పాలన్నారు. ఎన్నికల సమయంలో వైసీపీ కుట్రలపై అప్రమత్తంగా ఉండి తిప్పికొట్టాలని చంద్రబాబు సూచించారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే పార్టీ కోసం పని చేసిన అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సాయంత్రం సత్తెనపల్లిలోని హెలిప్యాడ్ వద్ద చంద్రబాబుకు నేతలు వీడ్కోలు పలికారు. అంతర్గత సమావేశంలో అభ్యర్థులు పెమ్మసాని చంద్రశేఖర్, జూలకంటి బ్రహ్మారెడ్డి, యరపతినేని శ్రీనివాసరావు, డాక్టర్ అరవింద బాబు, జీవీ ఆంజనేయులు, కన్నా లక్ష్మీనారాయణ, భాష్యం ప్రవీణ్, తెనాలి శ్రావణ్ కుమార్, నక్కా ఆనందబాబు, రామాంజనేయులు, గల్లా మాధవి, నజీర్ అహమ్మద్‌లతో పాటు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, రాజ్యసభ మాజీ సభ్యుడు సుజనాచౌదరి, టీడీపీ, జనసేన నాయకులు కోవెలమూడి నాని, గాదె వెంకటేశ్వరరావు, బోనబోయినశ్రీనివాసయాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ తదితరులు ఉన్నారు.

ఓవర్ కాన్ఫిడెన్స్ వీడండి.. మెజార్టీ రావాలి

తన వద్ద ఉన్న సర్వే ఆధారంగా నియోజకవర్గాల వారీగా నేతల పనితీరును అంచనా వేసిన చంద్రబాబు పలు సూచనలు చేశారు. బేషజాలు వీడాలని, అందరూ కలసి పనిచేయాలన్నారు. ఇంకా కొన్ని చోట్ల నేతల పనితీరు బాగోలేదని సున్నితంగా మందలించారు. కొందరు నేతలు, అభ్యర్థులు మితిమీరిన విశ్వాసంతో ఉన్నారు.. ఇది సరికాదన్నారు. ఎప్పటికప్పుడు నియోజకవర్గంలో ఏమి జరుగుతుందో గమనిస్తూ ఉండాలని సూచించారు.

మాచర్లలో పార్టీ జోష్‌లో ఉందని, అయితే ఇక్కడ కొన్ని సామాజిక వర్గాలకు ఇంకా దగ్గర కావాల్సి ఉందని అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డికి సూచించారు. మాచర్లలో ప్రశాంత ఎన్నికల కోసం ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయాలని తెలిపారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేసేలా అధికారులపై ఒత్తిడి పెంచాలన్నారు.

సత్తెనపల్లిలో కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ విజయానికి కలసి పనిచేయాలని జనసేన నేత బొర్రా అప్పారావుకు చంద్రబాబు సూచించారు. నకరికల్లు మండలంలో మంచి మెజార్టీ రావాల్సిన బాధ్యత నాగోతు శౌరయ్య, కనుమూరి బాజీలదేనని ఆదేశించారు. కోడెల శివరామ్‌తో చంద్రబాబు విడిగా చర్చలు జరిపి కన్నా విజయం కోసం పనిచేయాలని సూచించారు.

నరసరావుపేట నియోజకవర్గంలో డాక్టర్ చదలవాడ అరవిందబాబు అందరినీ కలుపుకుపోవడంలేదని నేతలు చంద్రబాబు దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు నరసరావుపేటలో పార్టీ పరిస్థితిని చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. టికెట్ ఆశించిన నల్లపాటి రామచంద్రప్రసాద్‌తో చంద్రబాబు మాట్లాడారు. అరవిందబాబు విజయం కోసం పని చేయాలని తెలిపారు. గురజాలలో యరపతినేని విజయం కోసం కష్టపడి పనిచేయాలని డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాసరావుకు చంద్రబాబు చెప్పారు. పెదకూర పాడు పరిధిలోని ఓటర్ల జాబితాల్లోని అవ కతవకలపై ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. నేతలు సమష్టిగా పనిచేయాలని, భాష్యం ప్రవీణ్ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. జనసేన శ్రేణులతో సమన్వయంతో పనిచేయాలని ప్రవీణ్‌కు సూచించారు. జీవీ ఆంజనేయులతో వినుకొండ పరిస్థితిపై చంద్రబాబు సమీక్షించారు. గుంటూరు తూర్పు, పశ్చిమ అభ్యర్థులు నజీర్, మాధవీలతో చంద్రబాబు మాట్లాడుతూ స్థానిక కార్పొరేటర్లు, జనసేన, బీజేపీ నాయకులతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. తెనాలిలో పార్టీ శ్రేణుల మధ్య సమన్వయ లోపాన్ని సరిదిద్దుకోవాలని సూచించారు.



14న తెనాలికి పవన్‌కల్యాణ్

- గత షెడ్యూల్‌లాగానే కార్యక్రమం
- ఆయన ఆరోగ్యం మెరుగైందన్న మనోహర్

తెనాలి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెనాలి పర్యటన ఈ నెల 14న ఖరారైనట్లు ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. పర్యటనకు ముందు రోజు తీవ్ర జ్వరం రావటంతో ఈ నెల 3న తెనాలిలో జరగాల్సిన పవన్ పర్యటన వాయిదా పడిన విషయం తెలిసిందే. ఆయన ఆరోగ్యం మెరుగుపడటంతో తాజాగా తెనాలి పర్యటన తేదీని ఖరారు చేసినట్లు మనోహర్ తెలిపారు. తెనాలిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఈ మేరకు వివరాలను వెల్లడించారు. గత షెడ్యూల్‌లో సూచించినట్లుగానే 14న పవన్ పర్యటన సాగుతుందన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులు, అభిమానులు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని కోరారు.

వలంటీర్లను నట్టేట ముంచిన జగన్

తననే నమ్ముకున్న వలంటీర్లను జగన్ మోహనరెడ్డి మోసం చేయడానికి వెనకాడటంలేదన్నారు. వారి ఉద్యోగ ఒప్పంద కాలం మే 31తో రద్దవుతున్నా, వారికి తెలియనివ్వకుండా ఇంతకాలం జాగ్రత్త పడ్డారన్నారు. ఎన్నికల వరకు వలంటీర్లను వాడుకుని వదిలేసేందుకు ముందుగానే పథకం వేశారని, ఇందులో భాగంగానే వారితో బలవంతపు రాజీనామాలు చేయిస్తున్నారని విమర్శించారు. జూన్ 4న మీ ఫైల్‌పైనే సంతకం చేస్తానని, జీవితాలు మార్చేస్తానంటూ జగన్ చెబుతున్న అబద్ధపు మాటలను వలంటీర్లు అర్థం చేసుకోవాలన్నారు. నిజంగా వారిపై ప్రేమ అంతుంటే 4న చేస్తానన్న సంతకమేదో నోటిఫికేషన్‌కు నాలుగు రోజుల ముందు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు తోటకూర రమణారావు, న్యాయవాది హరిదాసు గౌరీశంకర్, ఇస్మాయిల్ బేగ్ పాల్గొన్నారు.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

చట్టాలను రూపొందించేటప్పుడు, కొన్ని ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వాటికి మినహాయింపులూ ఇస్తుండటం పరిపాటి. అయితే అలాంటి మినహాయింపులు ఆ చట్టానికి లొసుగులుగా పరిణమించినప్పుడు దిద్దుబాటు చర్యలు అనివార్యమవుతాయి. ఇటీవలికాలంలో వెలుగుచూస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలు ప్రధానంగా దిద్దుబాటు చర్యల ఆవసరాన్ని తెలుపుతున్నాయి.



ఫోన్ ట్యాపింగ్

చట్టం ఏమి చెబుతోందంటే...

చట్టాలను రూపొందించేటప్పుడు, కొన్ని ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వాటికి మినహాయింపులూ ఇస్తుండటం పరిపాటి. అయితే అలాంటి మినహాయింపులు ఆ చట్టానికి లొసుగులుగా పరిణమించినప్పుడు దిద్దుబాటు చర్యలు అనివార్యమవుతాయి. ఇటీవలికాలంలో వెలుగుచూస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలు ప్రధానంగా దిద్దుబాటు చర్యల ఆవసరాన్ని తెలుపుతున్నాయి.

ఫోన్ ట్యాపింగ్ అంటే ఒక వ్యక్తికి తెలియకుండా వారి సంభాషణలను వినేవిధంగా ఎవరైనా ఆ ఫోన్‌ను సాంకేతికంగా తమ ఆధీనంలోకి తెచ్చుకోవడం. అయితే ఫోన్‌లో సంభాషించేటప్పుడు వ్యక్తులు స్వేచ్ఛగా తమ భావాలను, వ్యక్తిగత విషయాలను, రహస్యాలను చర్చించే అవకాశం ఉంది. ఈ భావప్రకటన స్వేచ్ఛకు, గోప్యత హక్కుకు ఫోన్ ట్యాపింగ్ చర్యలు భంగం కలిగిస్తాయి. ఇది రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులైన ప్రకరణ 19(భావ ప్రకటన స్వేచ్ఛ), ప్రకరణ 21(జీవించే స్వేచ్ఛలో అంతర్భాగంగా ఉన్న గోప్యత హక్కు)లను ఉల్లంఘిస్తోంది.

ఇదే విషయాన్ని 'పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్' వర్సెస్ 'యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు ఉద్ఘాటించింది. టెలిఫోన్ సంభాషణలు గోప్యత హక్కుల కిందకు వస్తాయని అలాంటి హక్కును చట్టం నిర్ధారించిన పద్ధతిలో మినహా, ఇతరత్రా ఉల్లంఘించడం కిందికే వస్తుందని పేర్కొంది.

అయితే భారత రాజ్యాంగ ప్రకరణ 19(2)లో భావప్రకటన స్వేచ్ఛపై పరిమితులను పేర్కొన్నారు. ప్రజాసంక్షేమం, శాంతిభద్రతల దృష్ట్యా ఒక వ్యక్తి భావప్రకటన స్వేచ్ఛపై ప్రభుత్వం సహేతుక పరిమితులు విధించే సౌలభ్యాన్ని అందించింది. ఈ నిబంధనను అనుసరిస్తూ 'ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం 1885' సెక్షన్ 5(2) ప్రకారం ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో, ప్రజాభద్రత, భారతదేశ సార్వభౌమాధికారం, సమగ్రత, రాష్ట్రాల శాంతి భద్రతలు, విదేశాలతో స్నేహపూర్వక సంబంధాలు దెబ్బతినే అవకాశాలున్నప్పుడు, నేరం చేయడానికి ప్రేరేపించడం వంటి వాటిని నిరోధించడానికి ఫోన్ ట్యాపింగ్ చేసే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు దఖలుపడ్డాయి.

అయితే 'ఇండియన్ టెలిగ్రాఫ్(సవరణ) రూల్స్, 2007లోని రూల్ 419ఏ ద్వారా ఫోన్ ట్యాపింగ్‌కు అనుమతినిచ్చే అధికారిక హోదాల గురించి స్పష్టంగా పేర్కొంది. కేంద్ర, రాష్ట్రాల స్థాయిల్లో ఎవరెవరికి అధికారం ఉంటుందో చర్చించింది. రాష్ట్రస్థాయిల్లో ఆ రాష్ట్రాల్లో ఫోన్ ట్యాప్ చేసే అధికారం పోలీసులకు ఉంటుంది. రాష్ట్రప్రభుత్వ కార్యదర్శి(ఇన్‌చార్జ్ ఆఫ్ హోమ్ డిపార్ట్‌మెంట్) నుంచి ఉత్తర్వులు పొందాల్సి ఉంటుంది.

కేంద్రప్రభుత్వ స్థాయిలో ఫోన్ ట్యాపింగ్‌కు పది సంస్థలకు అనుమతి ఉంది.

1) ఇంటెలిజెన్స్ బ్యూరో
2) సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్
3) ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్
4) నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో

దిక్సూచి
DIKSUCHI

5) సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్
6) డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్
7) నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ
8) రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్
9) డైరెక్టరేట్ ఆఫ్ సిగ్నల్
10) ఢిల్లీ పోలీస్ కమిషనర్.

కేంద్రప్రభుత్వ స్థాయిలో ఫోన్ ట్యాపింగ్‌కు ఉత్తర్వులు జారీచేసే అధికారం మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్‌కు చెందిన భారత ప్రభుత్వ కార్యదర్శికి ఉంటుంది. అయితే అత్యవసర పరిస్థితుల్లో, కేంద్రస్థాయిలో జాయింట్ సెక్రటరీ స్థాయి కంటే తక్కువ కానీ హోదా గల అధికారి (కేంద్ర హోం కార్యదర్శి ఆథరైజ్ చేసినవారు) ఉత్తర్వులు ఇవ్వవచ్చు. అదేవిధంగా రాష్ట్రస్థాయిలో అత్యవసర పరిస్థితుల్లో రాష్ట్ర హోం సెక్రెటరీ ఆథరైజ్ చేసిన అధికారి ఉత్తర్వులివ్వవచ్చు.

ఒక్కోసారి ముందస్తు ఆదేశాలు పొందడం సాధ్యం కాని పరిస్థితులు లేదా మారుమూల ప్రాంతాల్లో నిఘా పెట్టాల్సిన సందర్భాల్లో కేంద్ర స్థాయిలో అయితే ఫోన్ ట్యాపింగ్ అనుమతి గల పది అధీకృత సంస్థలకు చెందిన అధిపతులు లేదా వారి తరువాత గల రెండో అత్యంత సీనియర్ అధికారి ముందస్తు అనుమతితో ఫోన్ ట్యాప్ చేయవచ్చు. అదే రాష్ట్రస్థాయిలో అయితే ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీ సు స్థాయి కంటే తక్కువ హోదా కాకుండా ఉన్న అధీకృత అధికారుల నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. అయితే ఈ అనుమతుల గురించి అత్యు న్నత అధికారికి మూడురోజుల లోపు తెలియచేయాలి. ఏడు పని దినాల్లోగా సదరు అధికారి దానిని ఆమోదించ వచ్చు లేదా తిరస్కరించనూ వచ్చు. నిర్ణీత గడువు లోపు ఈ ఆమోదం పొందని పక్షంలో ఫోన్ ట్యాపింగ్ నిలిపివేయాలి.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

ఈ టెలిఫోన్ ట్యాపింగ్ దుర్వినియోగం కాకుం డా ఈ చట్టం కొన్ని పరిమితులను విధించింది.

1. సమాచారం పొందేందుకు వేరే మార్గం లేకుంటే మాత్రమే టెలిఫోన్ ట్యాపింగ్ ఉత్తర్వులివ్వాలి.
2. ట్యాపింగ్ ఆదేశాలు ముందుగా ఉపసంహరించు కోని పక్షంలో అరవై రోజులు అమలులో ఉంటాయి. వీటిని పునరుద్ధరించవచ్చు. అయితే మొత్తంగా 180 రోజులకు మించి ఇవి అమలుకావు.
3. అధీకృత అధికారి జారీచేసే ట్యాపింగ్ ఆదేశాలపై ట్యాపింగ్‌కు గల కారణాలను తప్పనిసరిగా పేర్కొనాలి. అదేవిధంగా ఏడు పని దినాల్లోగా ఒక కాపీని సమీక్ష కమిటీకి నివేదించాలి.
4. కేంద్రంలో కేబినెట్ సెక్రటరీ నేతృత్వంలో న్యాయ శాఖ, టెలికాం శాఖ కార్యదర్శులు సభ్యులుగా సమీక్ష కమిటీ ఏర్పడగా రాష్ట్రస్థాయిలో రాష్ట్ర చీఫ్ సెక్రటరీ నేతృత్వంలో లా, హోం సెక్రటరీలు సభ్యులుగా సమీక్ష కమిటీ పనిచేస్తుంది. టెలిఫోన్ ట్యాపింగ్ అభ్యర్థనలను సమీక్షించడానికి ఈ కమిటీలు కనీసం రెండు నెలలకు ఒక్కసారైనా సమావేశం కావాల్సి ఉంటుంది.
5. ఫోన్ ట్యాపింగ్ రికార్డులు ఏదైనా సాక్ష్యాధారాలకు అవసరం అయితే తప్ప ఆరు నెలలకుమించి నిలువ చేయరు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఇలాంటి రికార్డులను ధ్వంసం చేస్తారు.
6. ట్యాపింగ్‌కు సాంకేతిక సహకారం అందించే టెలిఫోన్ సర్వీసు ప్రొవైడర్లు సైతం ఇలాంటి ట్యాపింగ్ వ్యవహారం ముగిసిన వెంటనే రెండు నెలల లోపు సదరు ట్యాపింగ్ రికార్డులను ధ్వంసం చేయాల్సి ఉంటుంది.
7. పత్రికాస్వేచ్ఛ రీత్యా పాత్రికేయుల ఫోన్ ట్యాపింగ్‌పై కఠిన ఆంక్షలున్నాయి.

అయితే చట్ట ప్రకారం ఇన్ని నియమ నిబంధనలు ఉన్నప్పటికీ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ రాజకీయ ఒత్తిడికి లోబడి అధీకృత సంస్థలు/ అధికారులు అక్రమంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడటం వంటి వ్యవహారాలు ఇటీవల వెలుగులోకి రావడంతో ఫోన్ ట్యాపింగ్‌పరంగా నియమ నిబంధనలు మరింత కఠినం చేస్తూ చట్టసవరణ చేయాల్సిన ఆవసరం గోచరిస్తోంది. అదేవిధంగా ప్రాథమిక హక్కులకు ముడిపడి ఉన్న అంశమైనందున ఫోన్ ట్యాపింగ్ అనుమతి, తదనంతర సమీక్ష నిర్వహించే యంత్రాంగాల్లో న్యాయవ్యవస్థ ఉనికి, ప్రమేయం వాంఛనీయమని, ఆ దిశగా చట్ట సవరణలు ఉండాలని విశ్లేషకులు సూచిస్తున్నారు. అంతేకాక ఈ అధికారాలను అక్రమాలకు, అవినీతికి, రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకున్న వారికి కఠిన శిక్షలు ఉన్నప్పుడే అక్రమ ఫోన్ ట్యాపింగ్‌ను నియంత్రించవచ్చని కూడా వారు అభిప్రాయపడుతున్నారు.

కోడింగ్ - డీకోడింగ్


రీజనింగ్

పార్ట్-3

కోడింగ్ - డీ కోడింగ్ చాప్టర్‌లో ఇప్పటి వరకు ఒక పదంలోని అక్షరాలు, మరొక అక్షరాలుగా మారే విధానంలో పలు పద్ధతులను తెలుసుకున్నారు. ఇప్పుడు నెంబర్ కోడింగ్‌ని పరిశీలిద్దాం.

నెంబర్ కోడింగ్‌లో ఒక పదానికి కోడ్‌గా సంఖ్యను ఇస్తారు. పదంలోని అక్షరాలకు సవ్యదిశ లేదా అపసవ్యదిశలో సంఖ్యలను విడివిడిగా రాయడం, ఆ సంఖ్యలను కూడి మొత్తం విలువగా చూపడం, గుణించడం, రెట్టింపు చేయడం, వర్గంగా తెలపడం, తిప్పి రాయడం వంటి అంశాలను పరిశీలించాలి.

నెంబర్ కోడింగ్ ప్రశ్నలకు సంబంధించి ఆలోచించే విధానంపై అవగాహన కోసం కింద ఇచ్చిన సూర్యకిరణాల డయాగ్రామ్‌ను పరిశీలించండి.



గమనించండి: పై డయాగ్రమ్‌లో BAG అనే పదాన్ని 14 రకాలుగా కోడింగ్ చేశారు. దాని వివరణలను 1 నుంచి 14 వరకు ఇప్పుడు పరిశీలిద్దాం.

1. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం సంఖ్యలు 2, 1, 7
2. BAG అనే పదానికి అపసవ్య దిశ వర్ణమాల(రివర్స్ ఆర్డర్) ప్రకారం సంఖ్యలు 26, 25, 20.
3. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలకు ఒక్కొక్క దానికి 4 కూడగా వచ్చాయి. (B అంటే 2+4=6, A అంటే 1+4=5, G అంటే 7+4=11 ఇక్కడ గమనించాల్సిన విషయం '4' అనే సంఖ్యనే కూడాలని ఏమిలేదు. ఏదో ఒక స్థిర సంఖ్యను పదంలోని అక్షరాలకు గల సంఖ్యలకు కూడవచ్చు)
4. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 2, 1, 7ల వర్గాలు(స్క్వేర్స్) 4, 1, 49.
5. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 2, 1, 7లను కూడగా 2+1+7=10.
6. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 2, 1, 7 లను కూడగా 2+1+7=10 కి రెట్టింపు 20.
7. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 2, 1, 7లను కూడగా 2+1+7=10 కి వర్గం 100.
8. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను గుణించగా అంటే లబ్దం 2 x 1 x 7 = 14
9. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యల విడివిడి వర్గములను కూడగా అంటే $2^2+1^2+7^2=4+1+49=54$.
10. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా 2+1+7=10 దీని నుంచి 3 తగ్గించగా 10-3=7, (ఇక్కడ మూడు తగ్గించడానికి కారణం ఆ పదంలో '3' అక్షరాలు ఉన్నాయి)
11. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా 2+1+7=10. దీనికి 3 కూడగా 10+3=13 (ఇక్కడ మూడు కూడటానికి కారణం ఆ పదంలో '3' అక్షరాలు ఉన్నాయి).
12. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా 2+1+7=10. దీనిని 3తో గుణించగా 10 x 3 = 30 (ఇక్కడ 3తో గుణించడానికి కారణం ఆ పదంలో '3' అక్షరాలు ఉన్నాయి).
13. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా 2+1+7=10. దీనిని తిప్పి రాయగా 01.
14. BAG అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల అపసవ్య దిశ(రివర్స్ ఆర్డర్) ప్రకారం సంఖ్యలు 25, 26, 20 వీటిని కూడగా 25+26+20=71. ఈ విధంగా ఒక పదానికి ఎన్ని రకాలుగానైనా కోడ్ సంఖ్యలను తెలుపవచ్చు. అందువల్ల దీనిపై మీరు పట్టు సాధించాలంటే వర్ణమాల సవ్యదిశ, అపసవ్యదిశ అక్షరాలకు గల సంఖ్యలపై పూర్తి అవగాహన కచ్చితంగా ఉండి తీరాల్సిందే.



పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇప్పుడు కొన్ని ప్రశ్నలను పరిశీలిద్దాం.

1. ఒక కోడ్ భాషలో 'HUMAN'ను 82113114గా రాశారు. అదే కోడ్ భాషలో 'STAND' ను ఏ విధంగా రాస్తారు?

ఎ) 19201243 బి) 19201144 సి) 19211243 డి) ఏదీకాదు

సమాధానం (బి)

వివరణ: వర్ణమాల ప్రకారం H అంటే 8వ అక్షరం, U అంటే 21వ అక్షరం, M అంటే 13వ అక్షరం, A అంటే 1వ అక్షరం. N అంటే 14వ అక్షరం. ఈ సంఖ్యలను పక్కపక్క రాస్తే 82113114. ఇదే విధంగా పదం 'STAND' లో వర్ణమాల ప్రకారం S అంటే 19వ అక్షరం, T అంటే 20వ అక్షరం, A అంటే 1వ అక్షరం, N అంటే 14వ అక్షరం, D అంటే 4వ అక్షరం. ఈ సంఖ్యలను పక్కపక్క రాయాలి. కాబట్టి సమాధానం 19201144 అవుతుంది.

2. ఒక కోడ్ భాషలో HEART ÷ ART=3 అయితే అదే కోడ్ భాషలో PHONE ÷ ONEను ఏ విధంగా రాస్తారు?

ఎ) 8 బి) 12 సి) 10 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: గుర్తు '÷' కు ఇరువైపుల గల ARTని తొలగిస్తే చేసిన H, E ఉంటాయి. వర్ణమాల ప్రకారం H అంటే 8వ అక్షరం వర్ణమాల ప్రకారం E అంటే 5వ అక్షరం ఇప్పుడు పెద్ద సంఖ్య నుంచి చిన్న సంఖ్య తీసివేస్తే 8-5=3 అవుతుంది. అదే విధంగా PHONE ÷ ONEలో గుర్తు '÷'కు ఇరువైపుల ONEని తొలగిస్తే P, H ఉంటాయి. వర్ణమాల ప్రకారం P అంటే 16వ అక్షరం, H 8వ అక్షరం. ఇప్పుడు పెద్ద సంఖ్య నుంచి చిన్న సంఖ్య తీసివేస్తే 16-8=8 సమాధానం అవుతుంది.

3.ఒక కోడ్ భాషలో RUNను $B_9C_7B_7$ గా రాశారు. అదే కోడ్ భాషలో NILను ఏ విధంగా రాస్తారు?

ఎ) $B_7C_3B_6$ బి) $B_6C_3B_7$
సి) $C_3B_6B_7$ డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: RUN అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 18, 21, 14. అతి తక్కువ ప్రధాన సంఖ్యను ప్రాధాన్యంలోకి తీసుకోవాలి. అంటే 18 అనేది అతి తక్కువ ప్రధాన సంఖ్య 2తో భాగించవచ్చు. అందుకని B అక్షరాన్ని తీసుకున్నాం. ఎన్ని రెండ్లు 18. 9 రెండ్లు కావున B_9. అదే విధంగా 21ని అతి తక్కువ ప్రధాన సంఖ్య 3తో భాగించవచ్చు. అందుకని 3వ అక్షరం C ని తీసుకున్నాం. 3 x 7 = 21 కావున 'C_7' అదే విధంగా N అంటే 14వ అక్షరం, అతి తక్కువ ప్రధాన సంఖ్య 2తో భాగించవచ్చు. అందువల్ల B అక్షరాన్ని తీసుకున్నాం. 2 x 7 = 14 అందువల్ల B_7 అంటే RUN - $B_9 C_7 B_7$ ఇదే విధంగా NIL అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 14, 9, 12. వీటిని వరుసగా అతి తక్కువ ప్రధాన సంఖ్యలైతే 2, 3, 2తో భాగించవచ్చు. కాబట్టి BCB అక్షరాలను తీసుకోవాలి. 2x7=14 కాబట్టి B_7. 3x3=9 కాబట్టి C_3, 2x6=12 కాబట్టి B_6. సమాధానం $B_7 C_3 B_6$



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్, సీనియర్ ఫ్యాకల్టీ




కైలాస వాహనంపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

కైలాస వాహనంపై శ్రీశైలేశుడి వైభవం

- మహాదుర్గగా దర్శనమిచ్చిన అమ్మవారు

శ్రీశైలం, ఏప్రిల్ 7: ఇల కైలాసంగా వెలుగొందుతున్న శ్రీశైలం క్షేత్రంలో ఉగాది మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు కైలాస వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శమిచ్చాడు. మహాదుర్గ అలంకారంలో భ్రమరాంబికా దేవి అమ్మవారు దర్శనమిచ్చారు. ఉగాది మహోత్సవాల్లో మూడో రోజు సోమవారం మల్లన్న ప్రభోత్సవం వైభవంగా నిర్వహించ నున్నారు. రాత్రి స్వామిఅమ్మవార్లకు నంది వాహన సేవ జరపనున్నారు. మహా సరస్వతి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారు.

బాబోయ్ ఎండలు..!



- 45 డిగ్రీలు దాటిన పగటి ఉష్ణోగ్రతలు
- కలిగిరి, చాగలమర్రిలో 45.8 డిగ్రీలు
- మరికొన్ని రోజులు వడగాడ్పుల తీవ్రత

విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ పెరుగుతున్న ఎండలకు తోడు వడగాడ్పులు వీయడంతో రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారింది. దక్షిణాదిలో ఏపీ, తెలంగాణ, ఉత్తర కర్ణాటక, దానికి ఆనుకుని విదర్భ, మరట్వాడ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలోని అనేక ప్రాంతాలు అగ్ని గుండాన్ని తలపించాయి. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నెలకొన్న ఎండ ప్రభావంతో రాత్రి వాతావరణం వేడిగా కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతల్లో కొత్తరికార్డులు నమోదయ్యాయి. ఆదివారం నంద్యాల జిల్లా చాగలమర్రి, నెల్లూరు జిల్లా కలిగిరిలో 45.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కడప జిల్లా ఖాజీపేట, సింహాద్రిపురంలో 45.6, బాపట్ల జిల్లా జే పంగులూరులో 45.5, కర్నూలు జిల్లా ఆలూరు, ప్రకాశం జిల్లా బొట్లగూడూరులో 45.4, పల్నాడు జిల్లా విజయపురిలో 45.2 డిగ్రీలు నమోదైనట్టు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రాష్ట్రంలోని 107 మండలాల్లో తీవ్ర గాడ్పులు, 235 మండలాల్లో వడగాడ్పులు వీచాయని, రానున్న రెండురోజులు కూడా వడగాడ్పులు కొనసాగుతాయని హెచ్చరించింది. ఒడిశా నుంచి ఛత్తీస్‌గఢ్, విదర్భ, కర్ణాటక మీదుగా తమిళనాడు వరకు ద్రోణి విస్తరించిందని, దీని ప్రభావంతో సోమవారం కోస్తాలో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది.

వైద్యుల రక్షణకు చట్టం రూపొందించాలి

- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయచంద్రనాయుడు

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 7: వైద్యులకు రక్షణ చట్టాన్ని తీసుకుని రావాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.జయచంద్రనాయుడు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ స్థాయిలో రూపొందించిన హెల్త్ మేనిఫెస్టోను ఆదివారం సాయంత్రం కర్నూలు ఐఎంఏ భవన్‌లో ఆయన ఆవిష్కరించారు. కేంద్ర రాష్ట్రాల్లో సగటున ఆరోగ్యానికి జీడీపీలో 1.1 నుంచి 1.6 శాతం బడ్జెట్‌ను పారిశుద్యం, తాగు నీరు కలుపుకొని కేటాయిస్తున్నారన్నారు. ఈ బడ్జెట్‌లో ప్రత్యేకంగా వైద్య ఆరోగ్యానికి 2.5 శాతానికి పెంచాలని, మొత్తంగా 5.5 శాతానికి పెంచాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వైద్యులపై దాడులను నిరోధించే విధంగా సమగ్ర చట్టాన్ని చేసి వైద్యులను, ఆసుపత్రులను కాపాడాలని కోరారు.

ఉగాదికి ఉసూరు!



- నిరుడంతా కరువు, తుఫాన్ దెబ్బ
- అన్నదాతకు అందని విపత్తు సాయం
- పంటల బీమా సొమ్ము ఇప్పట్లో ఇవ్వరట
- కొత్త ప్రభుత్వంలోనే రైతుకు సొమ్ములు?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నూతన సంవత్సరాది 'ఉగాది'కి రైతు కుటుంబాలు కళకళ లాడుతూ ఉంటాయి. ఖరీఫ్ దిగుబడులపై వచ్చిన సొమ్ముతో వేసిన రబీ పంటలు అమ్ముకుని, బాకీలు తీర్చుకుని, మిగిలిన డబ్బుతో శుభకార్యాలు వంటివి జరుపుకొంటారు. ఉగాది నాడు కొత్త పంచాంగం ప్రకారం మళ్లీ తొలకరిలో ఏ పంటలు సాగుకు అనుకూలమో పండితుల ద్వారా తెలుసుకుని, నైరుతి రుతుపవనాలు వచ్చాక ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతారు. కానీ, ఈ ఏడాది ఆ పరిస్థితి లేదు. అత్యధిక శాతం రైతులు-కూలీల కుటుంబాల్లో దైన్యం ఆలుముకుంది. ఉగాది నాడూ ఉసూరుమనే పరిస్థితి. కారణం.. నిరుడంతా కరువు, పైగా తుఫాన్ దెబ్బకు రాష్ట్ర రైతాంగం అన్ని విధాలా నష్టపోయింది. గత ఏడాదంతా తీవ్ర వర్షాభావం వెంటాడింది. లక్షలాది ఎకరాల్లో విత్తనమే వేయలేని పరిస్థితి. వేసిన పంటకు పెట్టుబడులు పెరిగాయి. ఖరీఫ్ పంట కోసి, రబీ సాగు మొదలైన తరుణంలో వచ్చిన మిచౌంగ్ తుఫాన్ డిసెంబరులో రెండు పంటల్నీ దెబ్బతీసింది. కరువు, తుఫాన్ ఫలితంగా దిగుబడులు గణనీయంగా తగ్గాయి. గత ఖరీఫ్‌లో 90లక్షల ఎకరాలకుగాను 62.5 లక్షల ఎకరాల్లో మాత్రమే రైతులు పంటలేశారు. 27.5 లక్షల ఎకరాల్లో విత్తనమే పడలేదు. రబీలో 57.5 లక్షల ఎకరాలకుగాను 42 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగయ్యాయి. 15.5 లక్షల ఎకరాలు బీడుగా మారాయి. రెండు సీజన్లలో 43 లక్షల ఎకరాలు వ్యవసాయ పంటలకు నోచుకోలేదు. ఫలితంగా వేల టన్నుల్లో పంట ఉత్పత్తులు తగ్గాయి. వేసిన పంటలకూ దిగుబడులు ఆశాజనకంగా రాలేదు. ఖరీఫ్‌లో 448 మండలాల్లో తీవ్ర వర్షాభావం ఏర్పడితే, జగన్ సర్కార్ తొలుత 103 మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించింది. రబీ సీజన్ ముగిశాక.. గత నెల 16న సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలకు కొద్ది క్షణాల ముందు కంటితుడుపుగా మరో 87 కరువు మండలాలను ప్రకటించారు. కరువు, తుఫాన్ నష్టానికి రూ.1,294 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేస్తున్నట్లు చెప్పి, గత నెల ఆరో తేదీనే సీఎం జగన్ ఆర్భాటంగా బటన్ నొక్కారు. ఖజానాలో నిధులు లేకుండానే బటన్ నొక్కడంతో ఆ డబ్బులు ఖాతాల్లో ఎప్పుడు పడతాయా అని 11.59 లక్షల మంది రైతులు ఎదురు చూస్తున్నారు. ఫిబ్రవరిలో సీఎం జగన్ విడుదల చేసిన రైతుభరోసా, సున్నావడ్డీ రాయితీ సొమ్ము కూడా ఇప్పటికీ కొంత మంది ఖాతాల్లో జమ కాలేదని చెప్తున్నారు. నిరుడు కరువు, తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు పంటల బీమా పరిహారం ఈ ఏడాది జూన్‌లో వస్తుందని చెప్తున్నారు. వాస్తవంగా 2022-23 రబీ, 2023-24 ఖరీఫ్-రబీ సీజన్లకు కలిపి దాదాపు రూ.3వేల కోట్లకుపైగా పంటల బీమా సొమ్ము రైతులకు అందాల్సి ఉంది. కష్టనష్టాల్లో ఉన్న రైతులకు చాలీచాలకుండా ఇచ్చే ప్రభుత్వ సాయం కూడా సకాలంలో అందక వేలాది మంది రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ జూన్ 4 వరకు కొనసాగనుండగా, ఈలోపు రైతులకు సర్కార్ సాయం అందే పరిస్థితి కనిపించడం లేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే చెల్లింపులు జరుగుతాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అప్పటి దాకా రైతులు ఎదురుచూడక తప్పదని ఆ వర్గాలు చెబుతున్నాయి.

ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాలు

- ఇద్దరు మృతి, నలుగురికి తీవ్ర అస్వస్థత.. మరో ముగ్గురికి స్వల్ప గాయాలు

పరవాడ(అనకాపల్లి జిల్లా), ఏప్రిల్ 7: అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలోని విశాఖ ఫార్మాసిటీలో శనివారం అర్ధరాత్రి, ఆదివారం తెల్లవారుజామున వేర్వేరు ఫార్మా పరిశ్రమల్లో సంభవించిన ప్రమాదాల్లో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. నలుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మరో ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అల్కలీ మెటల్స్ లిమిటెడ్ యూనిట్-3 పరిశ్రమలో ఆదివారం తెల్లవారుజామున నాలుగున్నర గంటల ప్రాంతంలో ప్రొడక్ట్ బ్లాక్‌లోని జీజీ-2 ట్యాంక్ పైపులైన్ వద్ద మిథైల్ నైట్రేట్ గ్యాస్ లీకైంది. ఈ ఘటనలో విధుల్లో ఉన్న సీహెచ్ రమణ (32) విపరీతంగా గ్యాస్ పీల్చి అక్కడే కుప్పకూలిపోయాడు. గ్యాస్ వాసన రావడంతో పై ఫ్లోర్‌లో పనిచేస్తున్న కార్మికులు కిందకు వచ్చి చూసేసరికి అపస్మారకస్థితిలో ఉన్న రమణను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కిందకు వచ్చిన నలుగురు కార్మికులు ఎ.శ్రీనివాసరావు, వై.గోపాల్, వి.అప్పారావు, బి.రవీంద్ర తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారికి అనకాపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖలోని మరో ఆస్పత్రికి తరలించారు. కాగా.. అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్-6 పరిశ్రమలో శనివారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు మృతి చెందాడు. మరో ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఇక్కడి వీటీడీ డ్రయర్ రూమ్‌లో ఫిట్టర్‌గా పనిచేస్తున్న ఆళ్ల గోవింద (32) డ్రయర్ రూమ్ బోల్టు బిగించే క్రమంలో ఒక్కసారిగా డోర్ తెరచుకుంది. దీంతో లోపల ఉన్న మిథైల్ నైట్రేట్ గ్యాస్ బయటకు రావడంతో దానిని పీల్చి కుప్పకూలిపోయాడు. డ్రయర్ రూమ్ డోర్ ఓపెన్ అయినప్పుడు వచ్చిన శబ్దానికి సమీపంలో ఉన్న కిటికీ అద్దం పగిలి గాజు ముక్కలు అక్కడపనిచేస్తున్న సూపర్‌వైజర్ బి.నరేంద్ర కంటికి తగలడంతో గాయపడ్డాడు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.బాబ్జి, మరో ఫిట్టర్ బి.గోవింద స్వల్పగాయాలతో బయటపడ్డారు. గోవిందను తొలుత అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందాడు. కాగా ప్రమాదాలు సంభవించిన పరిశ్రమలను అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ, పరిశ్రమల అధికారి చిన్నారావు, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, డిప్యూటీ తహశీల్దార్ శాంతిభూషణ్, సీఐ బాలసూర్యారావు పరిశీలించారు.

జగన్‌రెడ్డి నంబర్ వన్ మోసగాడు

- 3 రాజధానులు కావాలని దీక్ష చేసి మోస పోయాం
- అమరావతి రైతులకు అండగా ఉంటాం
- మంగళగిరి, తాడికొండలో టీడీపీకి లక్ష ఓట్ల మెజార్టీ తీసుకొస్తాం
- మూతేసిన మూడు రాజధానుల శిబిరం నిర్వాహకుడు గురునాథం



అమరావతి రైతులకు నమస్కరించి క్షమాపణ అడుగుతున్న గురునాథం

తుళ్లూరు, ఏప్రిల్ 7: సీఎం జగన్‌రెడ్డి మోసం చేయడంలో నంబర్ వన్ అని మూతేసిన మూడు రాజధానుల శిబిరం నిర్వాహకుడు, దళిత బహుజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం అన్నారు. ఆదివారం తుళ్లూరు వచ్చి రాజధాని అమరావతి రైతులను ఆయన క్షమాపణ కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'మూడు రాజధానులు కావాలని 35 గంటలు దీక్ష కూడా చేశా. అప్పట్లో టీడీపీకి మెజార్టీ ఉన్న శాసన మండలికి మూడు రాజధానుల బిల్లు పంపటంలో సీఎం జగన్‌రెడ్డి వంచనను తెలుసుకున్నాం. బయటకు రావడానికి ఇంత సమయం పట్టింది. ఎటువంటి పరిస్థితిల్లోనూ మూడు రాజధానులు ఉండవని, అమరావతే రాష్ట్ర ఏకైక రాజధాని అని ఇప్పుడు తెలుసుకున్నాం. దీక్షలు చేసి మేము మోసపోయాం. అమరావతికి భూములిచ్చి జగన్ ఆడుతున్న మూడు ముక్కలాటతో మీరు మోసపోయారు. అమరావతి రైతులకు ప్రతి క్షణం అండగా ఉంటాం. మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాలలో ఉమ్మడి టీడీపీ అభ్యర్థులకు లక్ష ఓట్ల మెజార్టీ తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం. లోకేశ్ అమరావతి రైతులను కలసి క్షమాపణ అడగమని చెప్పారు. వెంటనే మిమ్మల్ని కలవడానికి వచ్చా' అని గురునాథం వివరించారు.

టీడీపీ నాయకుడి ఎర్రచందనం చెట్ల నరికివేత



ముకుందనాయుడు తోటలో ఎర్రచందనం చెట్లను నరికేసిన దృశ్యం

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 7: శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం ముత్తవకుంట్ల గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, రైతు ముకుందనాయుడి తోటలో 50 ఎర్రచందనం చెట్లను గుర్తుతెలియని దుండుగులు నరికేశారు. నాయుడు తన పొలంలో ఐదేళ్ల క్రితం 100 ఎర్రచందనం చెట్లు సాగు చేశాడు. దుండగులు అందులోని 50 చెట్లను నరికేశారు. రైతు ఆదివారం ఉదయం పొలానికెళ్లి చెట్లను నరికేసిన విషయాన్ని గుర్తించాడు. దీనిపై కనగానపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను టీడీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుండడంతో వైసీపీ నాయకులు కక్షపెంచుకున్నారని రైతు వాపోయాడు. తనను రాజకీయంగా, ఆర్థికంగా దెబ్బతీసేందుకు రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ప్రోద్బలంతో స్థానిక వైసీపీ నాయకులు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు ఆరోపించారు. ఇలాంటి బెదిరింపులకు బెదిరేదే లేదనీ, చెట్లను నరికేయడం సిగ్గుచేటని మండిపడ్డారు.

రాయలసీమను 'రాయల్'సీమగా చేశాం

- జగత్‌కంత్రీ... మహాకంత్రీ... ఈ సీఎం: ఎమ్మెల్యే బాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం, ఏప్రిల్ 7: 'ఒకప్పుడు రాయలసీమగా ఉన్న ప్రాంతాన్ని తెలుగుదేశం వచ్చాక రాయల్ సీమగా మార్చాం. వైసీపీ అధికారం చేపట్టాక రక్తపు మరకల సీమగా మార్చింది' అని సినీనటుడు, శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడుతూ 'రాయలసీమ ఒకప్పుడు ఫ్యాక్షన్‌కు పెట్టింది పేరు. అలాంటి ఫ్యాక్షన్‌ను రూపుమాపి, బీటలువారిన భూములను సస్యశ్యామలం చేసి ఈ ప్రాంత రైతులను రాయల్‌గా చేసిన ఘనత టీడీపీ అధినేత చంద్రబాబుదే. సీఎం జగన్ మడమ తిప్పనని చెప్పి ఏకంగా మెడలు వంచేశారు. మద్యం ఏరులై పారుతోంది. పరిపాలన అస్తవ్యస్తంగా మారి వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి. ఈ దుర్మార్గపు పాలనను అంతమొందించాలి. సీఎం ఆడపిల్లల ఉసురు పోసుకుంటున్నారు. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ... జగన్ అందరికీ ద్రోహం చేశారు. నా అక్క చెల్లెమ్మలంటూ సొంత చెల్లెలుకే మోసం చేసిన నీచుడు జగన్. ఇలాంటి ముఖ్యమంత్రి మరోసారి వస్తే రాష్ట్ర ప్రజలు ఉండాల్సిన పనిలేదు. ఈ రాక్షస పాలనకు త్వరలోనే చరమగీతం పాడేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. అనుభవం గల చంద్రబాబుకు దన్నుగా నిలవాలి' అని బాలకృష్ణ కోరారు.

విద్యార్థి ప్రాణం తీసిన క్రికెట్ బెట్టింగ్

- చదువుకోవాలని తల్లి మందలించడంతో ఆత్మహత్య

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 7: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ ఓ విద్యార్థి ప్రాణాన్ని బలిగొంది. చదువుకోవాలని తల్లి మందలించడంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఒంగోలులోని కొత్తపట్నం ఫ్లైఓవర్ సమీపంలో జరిగింది. చీమకుర్తి మండలం పుట్టచెరువుపాలేనికి చెందిన సింగరాజు చిరంజీవి (24) ఎంసీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అయితే పరీక్షలు రాయకుండా ఇంటికి వచ్చి క్రికెట్ బెట్టింగ్‌లతో కాలక్షేపం చేస్తున్నాడు. ఈ క్రమంలో అతన్ని తల్లి మందలించింది. దీంతో శనివారం రాత్రి ఒంగోలు హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్న తన పెద్దమ్మ ఇంటికి వెళుతున్నానని చెప్పి వెళ్లిన చిరంజీవి ఆదివారం తెల్లవారుజామున ఒంగోలు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.


వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో నిరసనలు వ్యక్తం చేస్తున్న మహిళలు, రైతులు

అమరావతిని నాశనం చేయడం సిగ్గుచేటు

● 1573వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్ళూరు ఏప్రిల్ 7: రాజధాని అమరావతిని అభివృద్ధి చేయటం చేత కాని వైసీపీ పాలకులు మూడు కడతామని ప్రగల్భాలు పలకటం విడ్డూరంగా ఉందని 33వేల ఎకరాలు అమరావతి నిర్మాణానికి భూములు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిలలు ధర్నా శిబిరాలు, ఇళ్ళ వద్ద నుంచి చేస్తున్న నిరసనలు, ఆందోళనలు ఆదివారం నాటికి 1573వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మహిళలు మాట్లాడుతూ, మూడు రాజధానులు కడతామని వైసీపీ పాలకులు ఈ ఐదేళ్ల ప్రజలను మోసం చేశారన్నారు. అన్నీ సౌకర్యాలు, హంగులతో ఏర్పాటు అవుతున్న, రాష్ట్ర నడిబొడ్డులో ఉన్న అమరావతిని నాశనం చేయటం సిగ్గుచేటన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అమరావతిలో అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక్క ఇటుక కూడా పెట్టలేదన్నారు. అంతేకాక జరుగుతున్న పనులు నిలిపివేసి నిర్మాణ కంపెనీలను అమరావతి నుంచి పారిపోయే విధంగా చేశారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని ప్రకటించాలన్నారు. లేదంటే ఎన్నికల్లో ఓటు ద్వారా వైసీపీని ఇంటికి పంపుతామని హెచ్చరించారు. రాజధా 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

ప్రత్తిపాటి కుటుంబంలో విషాదం

● మామయ్య బొగ్గవరపు వీరయ్య కన్నుమూత



బొగ్గవరపు వీరయ్య భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ప్రత్తిపాటి పుల్లారావు, సతీమణి వెంకటకుమారి, ఇన్‌సెట్లో వీరయ్య (ఫైల్)

చిలకలూరిపేట, ఏప్రిల్7: మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుటుంబంలో విషాదం నెలకుంది. అనారోగ్యంతో ఉన్న ఆయన మామయ్య బొగ్గవరపు వీరయ్య(85) హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున కన్ను మూశారు. గుండెపోటు రావటంతో నాలుగు రోజుల క్రితం ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారు. శస్త్ర చికిత్స అనంతరం మరోసారి గుండెపోటు రావటంతో ఆయన కన్నుమూశారు. కర్లపాలెం మండలం గణపవరం వీరయ్య స్వగ్రామం. ఆయనకు నలుగురు సంతానం. ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ప్రత్తిపాటి పుల్లారావు సతీమణి వెంకటకుమారి రెండవ కుమార్తె. పట్టణంలోని పండరీపురంలో ప్రత్తిపాటి నివాసగృహంలోనే వీరయ్య, ఆయన భార్య నివాసం ఉంటున్నారు వీరయ్య భౌతికకాయాన్ని పట్టణంలోని కృష్ణనగర్‌లో ఉన్న ఆయన కుమారుడు బొగ్గవరపు అంకమరావు గృహం వద్దకు తీసుకువచ్చారు. వీరయ్య మృతిపట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. పుల్లారావు దంపతులతో పాటు మాజీ ఎంఎల్‌సీ ఏఎస్ రామకృష్ణ, గుంటూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలువురు ప్రముఖులు, పట్టణానికి చెందిన వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు వీరయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన కుమారుడు అంకమరావు దహన సంస్కారాలు చేశారు.

ఓట్ల కోసం జగన్ శవ రాజకీయాలు

● నాడు తండ్రి, బాబాయి.. ఇప్పుడేమో అవ్వాతాతలు
● ఓట్ల కోసం 32మంది వృద్ధుల ప్రాణాలను బలిగొన్నారు
● జగన్‌పై విరుచుకుపడ్డ లోకేశ్



లోకేశ్‌ను సత్కరిస్తున్న బైక్ మెకానిక్‌లు, నిర్మాణరంగ కార్మికులు, కుప్పురావుకాలనీలో హారతులిస్తున్న స్థానిక మహిళలు

మంగళగిరి, ఏప్రిల్ 7: ఓట్ల కోసం శవ రాజకీయాలు చేసే నీచసంస్కృతికి జగన్ దిగజారిపోయాడని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. మంగళగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న లోకేశ్ ఆదివారం సాయంత్రం మంగళగిరిలో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక కుప్పురావుకాలనీలో మాట్లాడుతూ ప్రతి ఎన్నికకు ముందు శవ రాజకీయాలు చేయడం జగన్‌కు అలవాటుగా మారిందన్నారు. 2014లో తండ్రి పేరుతోను, 2019లో బాబాయి పేరుతోను రాజకీయం చేసిన జగన్ ఇపుడు వృద్ధులకు సామాజిక పెన్షన్‌లను ఇవ్వకుండా వుద్దేశపూర్వక జాప్యంచేసి 32మంది మరణాలకు కారణమయ్యాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అవ్వాతాతలకు ఇస్తున్న రూ.3వేల పెన్షన్‌లను రూ.4వేలకు పెంచి ఇళ్లవద్దకే వచ్చి అందిస్తామని లోకేశ్ హామీనిచ్చారు. సామాజిక పెన్షన్‌లతోపాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలను కూడా వలంటీర్ల ద్వారా అందిస్తామన్నారు. తమ ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీ ద్వారా పేదలందరికీ మెరుగైన వైద్య సదుపాయం కల్పిస్తామని, ఆ పరిధిలోకి రానివారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందించి ఆదుకుంటామని హామీలనిచ్చారు

బైకు మెకానిక్‌లకు శిక్షణాకేంద్రాలు

నిర్మాణరంగంలోని కార్మికులు మరింత మెరుగైన మెళకువలను నేర్చుకునేందుకు వీలుగా మంగళగిరిలో కనస్ట్రక్షన్ అకాడమీని ఏర్పాటుచేస్తామని టీడీపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీనిచ్చారు. నియోజకవర్గంలోని చిర్రావూరు, ప్రాతూరు, గుండిమెడ, పెదకొండూరు, గొడవర్రు గ్రామాలకు చెందిన ఇసుక ముఠా కార్మికులు, భవన నిర్మాణరంగ కార్మికులు, బైకు మెకానిక్‌లతో లోకేశ్ ఆదివారం ఉండవల్లిలోని తన నివాసంలో వరుస సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చాక కార్మిక సంక్షేమబోర్డును పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి చంద్రన్న బీమా పథకం, పనిముట్ల పంపిణీ అమలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక కార్మికులు, భవన నిర్మాణరంగ కార్మికులు ఈ సందర్భంగా తమ సమస్యలను లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. పాత ఇసుక విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని, ఇసుక క్వారీల్లో అక్రమ మైనింగ్ వలన భూగర్భ జలాలు ఇంకిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చినవెంటనే జిల్లా లేదా పార్లమెంటు నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని బైక్ రిపేర్ శిక్షణా కేంద్రాలను ఏర్పాటుచేస్తామని లోకేశ్ చెప్పారు. ఆటోనగర్ స్థలాలను కబ్జా చేసేందుకు వైసీపి ప్రభుత్వం కుట్రపూరితంగా తెచ్చిన జీవోలను తమ ప్రభుత్వం రద్దుచేసి ఆటోనగర్ కార్మికులకు అండగా నిలుస్తుందని లోకేశ్ చెప్పారు.

ముమ్మరంగా ప్రచారం..

మంగళగిరి అభివృద్ధిపై తనకొక విజన్ వుందని.. ప్రజలు అవకాశం కల్పిస్తే అహర్నిశలు శ్రమించి ఇచ్చిన హామీలన్నింటిని నిలబెట్టుకుంటానని లోకేశ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి ఆయన మంగళగిరిలోని కుప్పురావుకాలనీ, శ్రీశైలనగర్, కొలనుకొండ స్టేజీ సెంటర్లలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగించారు. గత ఎన్నికల సమయంలో మంగళగిరికి అనేక హామీలు ఇచ్చిన ఆళ్ల ఒక్కటి కూడ నెరవేర్చలేకపోయారన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో స్వర్ణకార కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి ఉద్యమకారులను గౌరవిస్తామని చెప్పారు. అలాగే మంగళగిరి ఏరియాలో దీర్ఘకాలంగా ప్రభుత్వ భూముల్లో నివాసం వుంటున్నవారికి బట్టలు పెట్టి మరీ నివేశన పట్టాలను ఇప్పిస్తామని లోకేశ్ ధీమాగా చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

లోకేశ్‌తో మాజీ ఎమ్మెల్యే రావి భేటీ

● అతన్ని తోడ్కొని వెళ్లిన పెమ్మసాని, నరేంద్ర, రామాంజనేయులు
● త్వరలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్న రావి
● సముచిత స్థానం కల్పిస్తానని యువనేత హామీ

గుంటూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ ఆదివారం ఉదయం టీడీపీ యువనేత నారాలోకేశ్‌తో సమావేశమయ్యారు. గుంటూరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, పొన్నూరు టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్రకుమార్, ప్రత్తిపాడు అభ్యర్థి బి.రామాంజనేయులు.. వెంకట రమణను లోకేశ్ వద్దకు తీసుకువెళ్లడంలో కీలకంగా వ్యవహరించారు. ప్రస్తుతం వైసీపీకి దూరంగా ఉంటున్న రావి వెంకటరమణ 2004లో ప్రత్తిపాడు నుంచి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ తరుపున బరిలోకి దిగి ఆనాటి టీడీపీ అభ్యర్థి మాజీమంత్రి డాక్టర్ మాకినేని పెదరత్తయ్యపై విజయం సాధించారు. 2014లో పొన్నూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగి ఓటమి పాలయ్యారు. అనంతరం పొన్నూరు వైసీపీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ ఆ పార్టీ కోసం పనిచేశారు. అయితే 2019 ఎన్నికల్లో ఆయనకు పోటీ చేసే అవకాశం దక్కలేదు. ఆ ఎన్నికల్లో నరేంద్రపై గెలుపొందిన కిలారు రోశయ్యకు రమణకు మధ్య పొంతన కుదరలేదు.

పొన్నూరు వైసీపీలోని ఒక వర్గం ఎమ్మెల్యే కిలారు రోశయ్య తీరును వ్యతిరేకిస్తూ రమణ పక్షాన నిలిచారు. ఒక దశలో కిలారు రోశయ్యకు తిరిగి టిక్కెట్టు ఇవ్వవద్దంటూ సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి ఫిర్యాదు చేయడం జరిగింది. అయితే దీనికంతటికీ రావి వెంకటరమణను బాధ్యుడిని చేస్తూ వైసీపీ అధిష్ఠానం ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. అప్పటి నుంచి ఆయన వైసీపీకి దూరంగా ఉంటూ వచ్చారు. తిరిగి ఎన్నికలు ఆసన్న కావడంతో సస్పెన్షన్ ఎత్తి వేస్తాం తిరిగి పార్టీలోనికి చేరమంటూ రాయబారం కూడా జరిపారు. అంతే కాదు రోశయ్యకు బదులుగా పొన్నూరు టిక్కెట్టు పొందిన అంబటి మురళీకృష్ణ కూడా రావిని కలుపుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే రమణ మాత్రం తనను ఎందుకు సస్పెండ్ చేశారో చెప్పాలని తన వద్దకు వచ్చిన వారిని నిలదీయడం జరిగింది.

ఈ నేపథ్యంలో టీడీపీ నేతలు రమణను తన పార్టీలోనికి ఆహ్వానిస్తూ పావులు కదిపారు. ముందుగా ఎంపీ అభ్యర్థి పెమ్మసాని, ప్రత్తిపాటి, టీడీపీ అభ్యర్థి రామాంజనేయులు చొరవ తీసుకుని పొన్నూరు టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్లతో కూడా మాట్లాడి రమణను పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. కాగా ఆదివారం రమణను తమతో పాటు ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి తీసుకెళ్లి లోకేశ్‌కు పరిచయం చేశారు. ఈ సందర్భంగా లోకేశ్ ఈ ఎన్నికల్లో పొన్నూరు, ప్రత్తిపాడు, గుంటూరులో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాల్సిందిగా కోరుతూ ప్రభుత్వం అధికారంలోనికి రాగానే సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిసింది. దీంతో రావి త్వరలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరేందుకు అంగీకరించినట్టు తెలిసింది.

కూటమి ప్రభుత్వంతో మైనార్టీలకు మెరుగైన పథకాలు

● 50 షాదీఖానాల ఏర్పాటు ● ఇస్లాం బ్యాంక్ ద్వారా రుణాలు
● పిడుగురాళ్లలో 5వేల మందికి ఇఫ్తార్ విందులో లావు, యరపతినేని


పిడుగురాళ్ల ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మాట్లాడుతున్న పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 7: వైసీపీ నేతలు మైనారిటీ సోదరులను ఓటు బ్యాంక్‌గానే చూస్తున్నారని నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఆదివారం పిడుగురాళ్లలో ఇఫ్తార్‌విందు కార్యక్రమంలో పాల్గొన్న లావు మాట్లాడుతూ ఇప్పుడున్న ముస్లిం రిజర్వేషన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గించే అవకాశం లేదని, నియోజకవర్గం అంతటా 50 షాదీఖానాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. ఇస్లాంబ్యాంక్ ద్వారా వడ్డీలేని రుణాలు, యువతకు విదేశీ విద్య, ఆంక్షలు లేని దుల్హన్ పథకం కొనసాగించడం జరుగుతుందన్నారు. ఇప్పుడున్న పథకాల కంటే మరికొన్ని అదనంగా మైనారిటీలకు సంక్షేమ పథకాలు చంద్రబాబు అందిస్తానని సత్తెనపల్లి, క్రోసూరు సభలలో వెల్లడించడం జరిగిందన్నారు. సుమారు రూ.50లక్షల వ్యయంతో పిడుగురాళ్లలో అతిపెద్ద ఈద్గా నిర్మించడంతో పాటు మక్కాయాత్రకు పంపించడంలో యరపతినేని పెద్దమనసును ప్రతి ముస్లిం సోదరులు అర్థం చేసుకోవాలని లావు కోరారు. రేపటి ఎన్నికలలో తనకు, యరపతినేనికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో మైనారిటీల కుటుంబసభ్యులలో తానొక సభ్యుడినని గుర్తుచేస్తూ ఎంతో మందికి తనవంతు సాయం అందించడంతోపాటు ఆడబిడ్డల విద్య కొరకు పిడుగురాళ్ల మదర్‌సా నిర్మించడంతో పాటు షాదీఖానాను ఏర్పాటుచేసిన విషయాన్ని గుర్తుచేశారు. మండలి చైర్మన్‌గా షరీఫ్ నిజాయితీగా వ్యవహరించడం వల్లనే అమరావతి రాజధాని మనందరికి దక్కిందన్నారు. ముందుగా ప్రత్యేక దువా కార్యక్రమంలో లావు, యరపతినేనిలు పాల్గొన్నారు. అనంతరం రంజాన్ శుభాకాంక్షలు తెలిపి సుమారు 5వేల మంది ముస్లిం సోదరులకు ఇఫ్తార్‌విందును వడ్డించి వారితో కలిసి విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ బాబావలి, సయ్యద్ అమీర్‌అలి, డాక్టర్ వున్నం నాగమల్లిఖార్జునరావు, పరీద్‌మేస్త్రి, ఖాశింసైదా, కార్ సైదా, ఇంతియాజ్, ముజీబ్, వలి, సర్దార్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం మైనార్టీలు ఆలోచించి ఓటు వేయాలి

● ఆత్మీయసమావేశంలో ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్


ప్రసంగిస్తున్న నాదెండ్ల మనోహర్, పక్కన ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ మహమ్మద్ షరీఫ్

తెనాలి రూరల్, ఏప్రిల్ 7: గతంలో ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి టీడీపీ ప్రభుత్వం ఎంతగానో పాటు బడిందని, వైసీపీ ఐదేళ్ల పాలనలో ముస్లీం మైనార్టీలపై దాడులు పెరిగాయే తప్ప అభివృద్ధి చేసిందేమి లేదు. ముస్లిం మైనార్టీ సోదరులు తెలివైనవారు.. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఆలోచించి ఓటు వేయాలని తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం సాయంత్రం తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీల ఆధ్వర్యంలో నియోజవర్గంలోని ముస్లిం మైనార్టీ సోదరులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి ఇఫ్తారు విందు ఇచ్చారు. తెనాలి నియోజవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జ్ ఆలపాటి రాజేంద్రప్రసాద్, తెనాలి ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్, ఉమ్మడి పార్టీల ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్సీ షరీఫ్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పెమ్మసాని మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వంలో అబ్దుల్ కలామ్‌ని రాష్ట్రపతిని చేసిన టీడీపీ, బీజేపీని ముస్లిం మైనార్టీ సోదరులు ఆదరించి రాష్ట్రభవిష్యత్తుకోసం కూటమి చేస్తున్న ప్రయత్నంలో తమ వంతు భాగస్వామ్యంతో ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల అభివృద్ధికి, సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. తాము అధికారం చేపట్టిన తరువాత మీ అభివృద్ధికి, స్వేచ్ఛకు అన్ని విధాల రాబోయే ఉమ్మడి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ పాలనలో ముస్లిం మైనార్టీ సోదరులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ షరీఫ్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రానికి ఒరిగిందేమిలేకపోగా దాడుల సంస్కృతి పెరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యల ముస్లిం మైనార్టీ సోదరులు, ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుల రాజకీయాలు తగదు..

● టీడీపీ ఆర్యవైశ్య నాయకులు


మాట్లాడుతున్న ఏ సుబ్బారావు, గట్టు సత్యనారాయణ తదితరులు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 7: నారా చంద్రబాబునాయుడు రావులపాలెం సభలో గంజాయి కిరాణా షాపులలో దొరుకుతుందని మాట్లాడితే వక్రీకరించి కులానికి ఆపాదిస్తూ కుల రాజకీయాలు చేస్తున్నారని టీడీపీ ఆర్యవైశ్య నాయకులు మండిపడ్డారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో మాదకద్రవ్యాలు నిత్యావసర సరుకులా కిరాణా షాపులో దొరుకుతుందని చంద్రబాబు మాట్లాడితే వైసీపీ నాయకులు ఆర్యవైశ్యులను రెచ్చగొట్టి కులరాజకీయాలు చేస్తున్నారని టీడీపీ ఆర్యవైశ్య నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. నరసరావుపేటలో ఐపీలు పెట్టి ఆర్యవైశ్యులకు రూ.150కోట్లు టోపీలు పెట్టినవారిని రక్షిస్తూ ఎమ్మెల్యేతో కలిసి కమీషన్‌లు దండుకుంటున్న ఈ ఆర్యవైశ్యనాయకులు కులాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయం చేయడానికి సిగ్గుందా అని నిలదీశారు. కమీషన్లలో మాకు వాటా లేదని చెప్పే దమ్ము మీకు ఉందా అని, దమ్ముంటే అమ్మవారి విగ్రహం వద్దకు ప్రమాణానికి రావాలని సవాల్ విసిరారు. ఐపీలు పెట్టిన వారి దగ్గర దివంగత నేత రోశయ్య విగ్రహానికి బలవంతంగా విరాళాలు తీసుకున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఒంగోలు సుబ్బారావు గుప్తను, తెనాలిలో ఆర్యవైశ్యులను మోకాళ్ళ మీద కూర్చోబెట్టి వైసీసీ నాయకులు హీనంగా మాట్లాడితే నువ్వు ఎందుకు ఖండించలేకపోయావని అన్నారు. సమావేశంలో రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రతినిధి ఏ సుబ్బారావు, మాజీ కౌన్సిలర్ గుట్టపల్లి సత్యనారాయణ, కొత్తూరు హనుమంతురావు, రాష్ట్ర కార్యదర్శి వనమా శివ, అత్తులూరి సాంబశివ రావు, వనమా పవన్, మాజేటి పుల్లారావు, కొత్తూరి సుబ్బరాయుడు, కాకుమాను వెంకటరావు, కోడూరు రాము, ఆతుకూరి రామకృష్ణ, పల్లబోతు ప్రసాదు, నాగవరపు ప్రసాద్, తాళ్ళూరి సత్యనారాయణ, తాడేపల్లి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మయ్య హత్య కేసులో నిందితులను అరెస్టు చేయాలి

● దళిత, బహుజన, కమ్యూనిస్టు పార్టీల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతోన్న దళిత, బహుజన, ప్రజా సంఘాల నాయకులు

గుంటూరు, ఏప్రిల్ 7: సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా మాజీ కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మయ్యను హత్య చేసిన కేసులో నిందితులను ప్రభుత్వం, పోలీసులు ఇప్పటికైనా అరెస్ట్‌చేయాలని దళిత బహుజన, ప్రజాసంఘాలు, కమ్యూనిస్టు పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం స్థానిక అరండల్‌పేటలోని విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో నాదెండ్ల బ్రహ్మయ్య-హత్య-గుణపాఠాలు-కర్తవ్యాలు అంశంపై రెండు తెలుగు రాష్ట్రాల రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి దళిత, బహుజన, ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ న్యాయవాది శిఖా సురేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు మోహన్‌కుమార్ ధర్నా మాట్లాడుతూ బ్రహ్మయ్యను తామే హత్య చేశామని సీపీఐ(ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ చంద్రం ముఠా ప్రకటించినా ప్రభుత్వం, పోలీసులు నిందితులను అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో భీమ్ భారత్ నాయకులు పాగళ్ల ప్రకాష్, నాయీ బ్రాహ్మణ జేఏసీ నాయకులు తాటికొండ నరసింహారావు, సామాజిక విశ్లేషకులు సాధు మాల్యాద్రి, రైతుకూలీ సంఘం నాయకులు వేల్పూ రి నరసింహారావు, వీసికే పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె.జయసుధ, డెన్నిస్ రాయ్, బి.విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఇద్దరి మృతి


మృతిచెందిన మొండితోక బాలశౌరి, రాయల వెంకటేశ్వర్లు

రొంపిచర్ల, ఏప్రిల్7: మండలంలోని అన్నవరప్పాడు బ్రిడ్జి వద్ద లారీ ఢీకొనటంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈపూరు మండలం గోపువారిపాలెంకు చెందిన మొండితోక బాలశౌరి(53), రాయల వెంకటేశ్వర్లు(75) ద్విచక్ర వాహనంపై తురిమెళ్ల వెళుతూ రోడ్డు దాటుతుండగా అద్దంకి వైపు నుంచి వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బాలశౌరి అక్కడికక్కడే మృతి చెందగా వెంకటేశ్వర్లు నరసరావుపేటకు తీసుకు వెళ్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఇరువురిని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాలశౌరి పాస్టర్‌గా పని చేస్తుంటాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

అగ్ని ప్రమాదంలో రూ.3.50 లక్షలు నగదు బుగ్గిపాలు

● రూ.7 లక్షల వరకు ఆస్తి నష్టం


అగ్నిప్రమాదంలో కాలిపోయిన నగదును చూపుతూ విలపిస్తున్న బాధిత కుటుంబం

కొల్లూరు, ఏప్రిల్ 7: విద్యుదాఘాతం వల్ల ఏర్పడిన అగ్ని ప్రమాదంలో కౌలు రైతు కుటుంబం సర్వస్వం కోల్పోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లూరు మండలం తడికలపూడి గ్రామంలో రావుల కిరణ్‌బాబు ఆదివారం మధ్యాహ్నంలో విద్యుదాఘాతం వల్ల గృహంలో మంటలు రేగాయి. క్షణాల్లో మంటలు మొత్తం వ్యాపించి ఇంటితో పాటు పక్కనే ఉన్న ఐదు ఎకరాల వరి గడ్డి వామికి అంటుకుంది. అగ్ని ప్రమాదం విషయాన్ని రేపల్లెలోని అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారం ఇవ్వగా శకటంలో నీళ్ల లేవని, నింపుకుని వస్తామని సమాధానం ఇచ్చినట్లుగా స్థానికులు చెబుతున్నారు. ఈలోగా స్థానికులే మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. కంద పంట విక్రయించగా వచ్చిన డబ్బులు రూ.3.50 లక్షలు కూడా గృహంలోనే ఉండటంతో ప్రమాదంలో ఇంటిలోని వస్తువులతో పాటు పంట నగదు, ఆస్తి పత్రాలు కూడా అగ్నికి ఆహుతి అయ్యాయి. అగ్నిమాపక శకటం సమాచారం ఇచ్చిన రెండున్నర గంటల తరువాత సంఘటనా స్థలానికి చేరుకుంది. ఏడాది మొత్తం కష్టించి పండించగా వచ్చిన ఫలసాయం సొమ్ము మొత్తం బుగ్గిపాలు కావడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. ప్రమాద సమాచారం తెలుసుకున్న టీడీపీ నాయకులు డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, గుమ్మడి శివ, వేములపల్లి మోహనకృష్ణలు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

జాతీయ స్థాయి నాటకోత్సవాలు ప్రారంభం


కొత్తతరం కొడుకులు నాటికలోని ఓ సన్నివేశం

లింగారావుపాలెం(యడ్లపాడు), ఏప్రిల్ 7: భూమిపై జీవం ఉన్నంత వరకు కళారంగం మనుగడ సాగించాలన్నదే తమ ఆశయమని తెలుగు నాటకరంగ కళా పరిషత్‌ల సమ్మేళనం(వేదిక), పుచ్చలపల్లి సుందరయ్య కళాపరిషత్ అధ్యక్షులు ముత్తవరపు సురేష్‌బాబు అన్నారు. లింగారావుపాలెం కొండవీటి కళాపరిషత్, యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య కళాపరిషత్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి నాటికల పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు పోటీలకు సురేష్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలను, కళాకారులకు, నిర్వాహకులకు ప్రేక్షక ఆదరణే గొప్ప బలమన్నారు. నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ నాటిక పోటీలను ప్రేక్షకులు వీక్షించి ఆదరించాలని కోరారు. కొండవీటి కళాపరిషత్ అధ్యక్షుడు కట్టా శ్రీహరిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో ఉపాధ్యక్షులు తోకల సాంబశివరావు, సభ్యులు మల్నేని సీతారామాంజనేయులు, కట్టా వీరయ్య, కళాకారుడు మల్లాది శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సందేశాత్మకంగా సాగిన తొలిరోజు ప్రదర్శనలు

లింగారావుపాలెంలోని పోసాని సుబ్బారావుచౌదరి కళావేదికపై తొలిరోజైన ఆదివారం ప్రదర్శితమైన మూడు నాటికలు ఎంతో సందేశాత్మకంగా సాగాయి. పిల్లల్ని పెంచడం, పోషించడం తల్లిదండ్రుల బాధ్యత అని, అదే బాధ్యత పిల్లలకు కూడా వర్తిస్తుందన్న విషయాన్ని నేటి తరం మరచి పోతున్నదని, దాని వలన వయసు పైబడిన తల్లిదండ్రులు ఎన్ని అఘాయిత్యాలకు గురవుతున్నారో తెలియ చేస్తూ.. వయసు మీద పడిన తల్లిదండ్రులు కష్టమయినా తమ పిల్లల వద్దనే ఉండాలని సందేశాన్నిస్తూ సాగిన శ్రీ మణికంఠ ఆర్ట్స్, పిఠాపురం వారి 'కొత్తతరం కొడుకులు' నాటిక. రెండవ ప్రదర్శనగా తెలుగు కళాసమితి, విశాఖపట్నంవారి 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత', మూడవ ప్రదర్శనగా అమరావతి ఆర్ట్స్, గుంటూరువారి 'అమృతహస్తం' నాటికలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	154, 163,174
చికెన్ విత్ స్కిన్	294.00
చికెన్ స్కిన్ లెస్	304.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

వైసీపీని వీడిన పట్టణ ప్రముఖులు


వున్నం నాగమల్లికార్జునరావుకు పార్టీ కండువా కప్పుతున్న చంద్రబాబునాయుడు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 7: పిడుగురాళ్లకు చెందిన పలువురు ప్రముఖులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. సత్తెనపల్లిలో జరిగిన ప్రజాగళం సభలో పిడుగురాళ్లకు చెందిన ప్రముఖ వైద్యులు వున్నం నాగ మల్లికార్జునరావు, ఆర్యవైశ్య నాయకులు మద్దాళి సుబ్బయ్య, వైసీపీ కౌన్సిలర్ వున్నం భారతి భర్త ఆంజనేయులు, నాగులగుడి దేవస్థానం అధ్యక్షులు గుదె నాగసతీష్, గడిపూడి బుజ్జి, కరాలపాడుకు చెందిన చల్లా కోటిరెడ్డి, తుమ్మలచెరువులోని యాదవ సామాజికవర్గానికి చెందిన వీర్ల కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ షేక్ రంజాన్‌వలి, గడిపూడి సాంబశివరావు, వున్నం వంశీకృష్ణ తదితరులకు చంద్రబాబు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీ గెలుపునకు ప్రతిఒక్కరు కృషి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మరికొందరు ఉన్నారు.

ఇసుకను ఉచితంగా ఇస్తామనడం హర్షణీయం

● గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు మిర్చియార్డు మాజీ చైర్మన్ వెన్నా

బెల్లకొండ, ఏప్రిల్ 7: రాష్ట్రంలో ఉన్న పేదలకు ఇసుకను ఉచితంగా ఇస్తామని ప్రకటించటం శుభ పరిణామమని గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బెల్లంకొండ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా శనివారం సాయంత్రం పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరులో జరిగిన భారీ బహిరంగసభ విజవంతమైనందుకు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వెన్నా సాంబశివారెడ్డి మాట్లాడుతూ క్రోసూరులో జరిగిన బహిరంగ సభ వైసీపీ నాయకులకు దిమ్మ తిరిగి పోయిందని, పెదకూరపాడులో భాష్యం ప్రవీణ్ గెలవటం ఖాయమని సభ ద్వారా తెలిసిపోయిందని తెలిపారు. అంతేగాకుండా మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌కు పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్సీ పదవి ఇస్తామని చంద్రబాబు ప్రకటించటం సంతోషించదగ్గ విషయం అన్నారు. నరసరావుపేట ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలును, నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బాష్యం ప్రవీణ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, లక్ష్మీనారాయణ, అక్కల వెంక టరామిరెడ్డి, సలాం, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు, హనుమంతరావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జంగాతో యరపతినేని ఆత్మీయ సమావేశం


జంగాను సత్కరిస్తున్న యరపతినేని

దాచేపల్లి, ఏప్రిల్ 7: రానున్న ఎన్నికల్లో జంగా, యరపతినేని కలిసి పని చేస్తా మని.. భారీ మెజారిటీలో గెలుపు సాధిస్తామని అన్నారు. ఆదివారం గామాలపాడు ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి నివా సంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. వైసీపీకి చెందిన మాజీ ఉపాధ్యక్షుడు జగన్నాథం నాగయ్య, మరో 30 కుటుంబాలవారు టీడీపీలోకి చేరారు. మాజీ ఎంపీపీ అంబటి శేషగిరిరావు, మునగ నిమ్మయ్య. కొప్పుల గిరి, జంగా వెంకటకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి బ్రహ్మారెడ్డితోనే సాధ్యం


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

దుర్గి, ఏప్రిల్ 7: మాచర్ల నియోజకవర్గం అభివృద్ధి కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డితోనే సాధ్యమని టీడీపీ నేతలు అన్నారు. ఆదివారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రూపొందించిన సూపర్ 6 పథకాలను వివరించారు. ప్రస్తుతం వైసీపీ పాలన రాక్షస పాలన తలపిస్తోందని, ఎవరికీ సమన్యాయం జరగలేదన్నారు. బీసీలను అత్యధికంగా చంపిన పార్టీ వైసీపీ అన్నారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు, మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డికి ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల దాసు, మాగులూరి నారయ్య, మాజీ సర్పంచ్ యెల్లెబోయిన గోపాల్, జక్కా కొండలు, సూరె వెంకటేశ్వర్లు, ఆకుల చిన చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్

బెల్లంకొండ, ఏప్రిల్ 7: బెల్లంకొండ పెద మసీదు వద్ద ఆదివారం రాత్రి టీడీపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికిటీడీపీ రాష్ట్ర నాయకుడు వెన్నా సాంబశివారెడ్డి హాజరై నమాజ్ అనంతరం ఇఫ్తార్‌లో పాల్గొని వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంకొండలో ముస్లింలు అధికంగా ఉండటంతో ఇఫ్తార్‌ను ఏర్పాటు చేశారన్నారు. సుమారు నాలుగు వేల మందికి విందును ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, బెల్లంకొండ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఇబ్రహీం ఆధ్వర్యంలో విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సర్పంచ్ జ్యోతి సముద్రం, పీఎస్‌కే రసూల్, పీఎస్‌కే రహీం, తెలుగు యువత అధ్యక్షుడు సలాం, బీసీ సెల్ అధ్యక్షుడు గుంజా గంగారావు, సయ్యద్ జబ్బార్, మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే వారికి ఓటేయండి

● ఆర్ఎంపీ, పీఎంపీల ఆత్మీయ సమావేశంలో యరపతినేని


పిడుగురాళ్లలో జరిగిన ఆర్ఎంపీ, పీఎంపీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 7: టీడీపీ హయాంలో ఆర్ఎంపీ, పీఎంపీలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చింది చంద్రబాబునాయుడని గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం పిడుగురాళ్ల డివిజన్ ఆర్ఎంపీ, పీఎంపీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి వ్యక్తితో సత్సంబంధాలు కలిగివున్న ఆర్ఎంపీ, పీఎంపీలు అభివృద్ధి చేసే వారిని గుర్తించి ఓటు వేయాలని, రాష్ట్ర అభివృద్ధికి, యువత భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం రావడంతోనే సాధ్యమవుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రాష్ట్ర అభివృద్ధి, యువత భవిష్యత్తుపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించే అవకాశం ఆర్ఎంపీ, పీఎంపీలకే ఉంటుందని యరపతినేని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలుకు, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు సైకిల్ గుర్తుపై ఓటువేసి మద్ధతు తెలియజేయాలన్నారు. డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ప్రతిఒక్కరికి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటునందించే చంద్రబాబు కూటమికి మద్దతు ఇచ్చేలా చూడాలన్నారు. యరపతినేని రమేష్ మాట్లాడుతూ రాబోయే తరాలకు మంచి భవిష్యత్తు కల్పించాలంటే చంద్రబాబు నాయకత్వాన్ని బలపరచాలన్నారు. ఈ సమావేశంలో డివిజన్‌లోని ఆర్ఎంపీ, పీఎంపీలు పాల్గొన్నారు.

టీడీపీలో భారీగా చేరికలు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 7: వైసీపీని వీడి టీడీపీలో చేరికలు కొనసాగుతున్నాయి. ఆదివారం పిడుగురాళ్లలో గురజాల మండలానికి చెందిన 100 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. గొట్టిము క్కల, సమాధానంపేట, చర్లగుడిపాడు గ్రామాలకు చెందిన నోముల ప్రభుదాసు, మరియదాసు, అమరయ్య, సాగర్, కలపాల దాసు, ఇస్రం సాగర్‌తో పాటు మరికొందరికి యరపతినేని శ్రీనివాసరావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జమ్మిగుంపు ల లక్ష్మీనారాయణ, రావిపాటి రవికుమార్, నరసింహానాయక్, రొండి పాల్‌రాజ్, ఆవుల పెదకాశయ్య, తదితర పార్టీ నేతలు పాల్గొన్నారు.

కూటమికి ఓటు వేయండి.. మాచర్లను కాపాడండి

● ఉమ్మడి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి


కొత్తగంగరాజుపల్లె ఎన్నికల ప్రచారంలో జూలకంటి బ్రహ్మారెడ్డి

కారంపూడి, ఏప్రిల్ 7: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి కూటమికి ఓటు వేసి మాచర్ల నియోజకవర్గంను కాపాడండి అని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పేటసన్నిగండ్లతండాలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి కావాలంటే కూటమికి ఓటు వేయాలన్నారు. తనకు ఒక్కసారి అవకాశమిచ్చి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధిలో నడిపిస్తామన్నారు. నియోజకవర్గంలో ఎన్నో గ్రామాల్లో నీటి ఎద్దడి అధికంగా ఉందని, కూటమి అధికారంలోకి రాగానే తాగు, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, చప్పిడి రాము, బొల్నేడి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పంగులూరి అంజయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు గోరంట్ల నాగేశ్వరరావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, కార్యదర్శి తోట నరసింహారావు, ఉపాధ్యక్షుడు నాగవరపు రాముడు, పలిశెట్టి రాఘవ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాల్వ పేరయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాలునాయక్, బీజేపీ జిల్లా కార్యదర్శి శెట్టి హనుమంతురావు, జనసేన మండల అధ్యక్షుడు కేశానుపల్లి కృష్ణబాబు, పంగులూరి పుల్లయ్య, దొడ్డ వెంకట నారాయణ, మాదల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతో రాష్ట్రాన్ని కాపాడుకుందాం

కొత్తగంగరాజుపల్లె(రెంటచింతల), ఏప్రిల్ 7: గడిచిన 59 నెలల్లో అధికార పార్టీ అరాచకాలతో భ్రష్టుపట్టిన రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే టీడీపీని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంటుందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బ్రహ్మారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రాత్రి బాగా పొద్దుపోయిన తరువాత కృష్ణానది సమీపంలోని కొత్తగంగరాజుపల్లె గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ విధానాలపై విసిగివేసారి పోయారని దుయ్యబట్టారు. పార్టీ కోసం అహరహం శ్రమించిన వాళ్లకు మంచి ప్రాధాన్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాగరాజు, నాగేశ్వరరావు, శ్రీను, ఎన్ వెంకటరామారావు, లింగా పున్నారావు, నరసింహారావు, మాదవరావు, టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, సుమంత్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

మాచర్ల రూరల్, ఏప్రిల్ 7: పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన 10 వైసీపీ కుటుంబాలు ఆదివారం ఆ పార్టీని వీడి టీడీపీలో చేరాయి. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఉమ్మడి కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి వీరికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గొబ్బూరి శివ తదితరులు ఉన్నారు.

● ఆనందంగా ఉండాలంటే టీడీపీ రావాలి

మాచర్లటౌన్, ఏప్రిల్ 7: ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం చేయాలి.. ఆనందంగా ఉండాలంటే టీడీపీ రావాలి అని ఉమ్మడి కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌కేబీఆర్ కళాశాల గ్రౌండ్‌లో వాకింగ్ చేస్తూ వాకర్స్‌తో ముచ్చడించారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే మాచర్లలో అభివృద్ధి సాధ్యమన్నారు. యువతతో కలిసి కాసేపు క్రికెట్ ఆడారు. టీస్టాల్‌లో టీ తాగుతూ చిరు వ్యాపారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చూపిస్తాం : జూలకంటి శోభారాణి


అంబేద్కర్ కాలనీలో జూలకంటి శోభారాణికి స్వాగతం పలుకుతున్న ప్రజలు

మాచర్లటౌన్, ఏప్రిల్ 7: ఒక్కసారి ఆదరించి ఆశీర్వదించండి.. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తాం అని ఉమ్మడి కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి సతీమణి శోభారాణి అన్నారు. ఆదివారం పట్టణంలోని 16వ వార్డులో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాచర్ల నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడి పోయిందని, అందరూ ఒకసారి ఆలోచించాలని అన్నారు. బంగారు భవిష్యత్తు కావాలంటే బ్రహ్మారెడ్డితోనే సాధ్యమన్నారు. మంచి చేసేందుకు ముందుకు వచ్చామన్నారు. రానున్న ఎన్నికల్లో బ్రహ్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయించుకుందామని శోభారాణి అన్నారు. ఈ కార్యక్రమంలో బండారు కృష్ణవేణి, అనురాధ, కొమెర లక్ష్మి, శాంతి, నాగలక్ష్మి, మంగమ్మ, పద్మ, సంబోజు వేణు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

రెంటచింతల, ఏప్రిల్ 7: మాజీ సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఇతరులెవరూ ఆ విధంగా ఆలోచించరని కూటమి అభ్యర్థి బ్రహ్మారెడ్డి సతీమణి శోభారాణి అన్నారు. 7వ రోజైన ఆదివారం రెంటచింతల అంబేద్కర్ కాలని, ఎర్రపాలెంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి బాబు ష్యూరిటి భవిష్యత్తు గ్యారంటీ పథకాలను వివరించారు. బ్రహ్మారెడ్డికి ఒక్కసారి అవకాశమిస్తే నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తామని హామీనిచ్చారు. వారం రోజుల పాటు రెంటచింతల టౌన్లో నిర్వహించిన ప్రచారం ముగిసింది.. కాగా జూలకంటి గౌతంరెడ్డి ఇస్త్రీ దుకాణంలోకి వెళ్లి బట్టలు ఇస్త్రీ చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దళిత నేతలైన ఎం రవి, జ్ఞానయ్య, సామ్యేల్, శ్యామ్, థామస్, మరియదాసు, జక్కరయ్య, బాల ఏసు, ఎలీషా, ఎం రాయపరెడ్డి, మునినాయక్, టౌన్ అధ్యక్షులు రాజారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు సుమంత్‌రెడ్డి, బోడపాటి రామకృష్ణ, మాజీ ఎంపీటీసీలు శివయ్య, రాజ్ కుమార్, సిద్ధయ్య, అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొట్టడంతో మినీ వ్యాన్ డ్రైవర్ మృతి

చిలుకూరు, ఏప్రిల్ 7: తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో ఓ వ్యాన్ డ్రైవర్ మృతి చెందాడు. చిలుకూరు ఎస్ఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం కోదాడ నుంచి హుజూర్‌నగర్ వైపు వెళుతున్న మినీ వ్యాన్‌ను ఎదురుగా అతివేగంగా వస్తున్న లారీ కవితా జూనియర్ కళాశాల సమీపంలో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పల్నాడు జిల్లా పిడుగురాళ్ల సమీపంలోని జానపాడు గ్రామానికి చెం దిన మినీ వ్యాన్ డ్రైవర్ ఆదినారాయణ (45) అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు కోదాడలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నకరికల్లులో అక్రమ మద్యం స్వాధీనం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 7 : నకరికల్లులో 15 సీసాల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార ఆదివారం తెలిపారు. ఆదివారం సాయంత్రం నకరికల్లు గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తుండగా గ్రామ సమీపంలోని జానకి రామ రైస్ మిల్లు వద్ద అదే గ్రామానికి చెందిన పీ వెంకట రమణ అక్రమ మద్యం కలిగి ఉన్నాడన్నారు. నిందితుడిని అరెస్టు చేశామని, అతని వద్ద నుంచి 15 సీసాల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

పీసపాడులో రెండు పూరిళ్ళు దగ్ధం

క్రోసూరు, ఏప్రిల్ 7 : క్రోసూరు మండలం పీసపాడులో ఆదివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగి రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. నష్టం సుమారు రూ.4 లక్షల వరకు ఉంటుందని అంచనా. గృహాల్లోని వస్తువులు, వస్త్రాలు, ధాన్యం, కొద్దిపాటి నగదు పూర్తిగా అగ్నికి ఆహుతైనట్టు బాధితులు లక్ష్మీనారాయణ, శివయ్య తెలియజేశారు. తాము పూర్తిగా నిరాశ్రయులమయ్యామని వారు చెప్పారు. ప్రమాద స్థలాన్ని రెవెన్యూ అధికారులు సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు. బాధితులను ఆదుకుంటామని అధికారులు తెలియజేశారు.

జగన్ ప్రత్యేక హోదాపై మాట్లాడలేదు

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల

దాచేపల్లి, ఏప్రిల్ 7: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ఐదేళ్ల అయినా ఇంతవరకు ప్రత్యేక హోదా గురించి మాట్లాడలేదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆరోపించారు. ఆదివారం నారాయణపురంలోని సీపీఐ కల్యాణ మండపంలో గురజాల నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి మందపాటి రమణారెడ్డి అధ్యక్షత వహించారు. ముప్పాళ్ల తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ రాజధాని అమరావతిని జగన్ అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీప్రసాద్, సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, ఇండియా కూటమి పార్లమెంట్ అభ్యర్థి అలెగ్జాండర్, గురజాల అసెంబ్లీ ఇండియా కూటమి అభ్యర్థి తియ్యగూర యలమందారెడ్డి, శ్రీనివాసరెడ్డి, జయకృష్ణానాయక్, పిచ్చయ్య, వెంకటరెడ్డి తదితరులున్నారు.

చంద్రబాబును కలసిన కోడెల శివరామ్

సత్తెనపల్లి, ఏప్రిల్ 7: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును టీడీపీ నేత డాక్టర్ కోడెల శివరామ్ ఆదివారం సత్తెనపల్లిలో మర్యాద పూర్వకంగా కలసి సన్మానించారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో టీడీపీ విజయానికి కృషి చేస్తానన్నారు.

బీసీలకు వెన్నెముక తెలుగుదేశం పార్టీ

● సీనియర్ టీడీపీ నాయకులు యారాసి

మాచవరం, ఏప్రిల్ 7: ఎన్‌టీ రామారావు నుంచి నారా చంద్రబాబునాయుడు వరకు తెలుగుదేశం పార్టీలో బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని, బీసీలందరూ రానున్న సాధారణ ఎన్నికల్లో ఉమ్మడి కూటమికి ఓటు వేసి గెలిపించాల్సిన అవసరం ఉందని సీనియర్ టీడీపీ నాయకులు యారాసి వెంకటరావు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని గంగిరెడ్డిపాలెంలో గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షులు బడిగుంచల వెంకటేశ్వర్లు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యారాసి వెంకటరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పరిపాలన కాలంలో ఆదరణ పథకం ద్వారా బీసీలకు కులవృత్తుల వారీగా అనేక రకాల పథకాలు అందించారని, సాధారణ ఎన్నికల అనంతరం ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రాగానే బీసీలకు రక్షణ చట్టం, 50 సంవత్సరాలకే పింఛన్ పథకం వంటివి అనేక సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు చందాల శివ, ఎంపిటిసి కొక్కెర వీరస్వామి, గోళ్ల గంగాధర్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి నలబోతుల శ్రీనివాసరావు, గాంధీ నగరం ప్రసాద్, యారాసి నరేంద్ర, పలు గ్రామాల బీసీ సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

30 మైనారిటీ కుటుంబాలు టీడీపీలో చేరిక


ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

అమరావతి. ఏప్రిల్ 7: మండల పరిధిలోని మునగోడు గ్రామంలో అధికార పార్టీ వైసీపీకి షాక్ తగిలింది. సుమారు మైనారిటీలకు చెందిన 30కుటుంబాలు ఉమ్మడి కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముందుగా మండల పరిధిలోని కర్లపూడి, ఎండ్రాయి, దిడుగు గ్రామాల్లో జరిగిన ఇఫ్తార్‌లో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. మునగోడులో టీడీపీ నాయకులు షేక్ షరీఫ్ ఇచ్చిన ఇఫ్తార్‌లో ప్రవీణ్ పాల్గొన్నారు.

టీడీపీలో జోష్ నింపిన చంద్రబాబు పర్యటన


చంద్రబాబును సత్కరిస్తున్న భాష్యం ప్రవీణ్, కొమ్మాలపాటి, శ్రీకృష్ణదేవరాయలు

క్రోసూరు, ఏప్రిల్ 7: చంద్రబాబునాయుడు ప్రజాగళం కార్యక్రమం పెదకూరపాడు నియోజకవర్గ తెలుగుదేశంపార్టీలో జోష్ నింపింది. ఎమ్మెల్యే అభ్యర్థిగా భాష్యం ప్రవీణ్, ఎంపీ అభ్యర్థిగా లావు శ్రీకృష్ణదేవరాయలుకు సీట్లు కేటాయించిన వెంటనే నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేస్తూ ముమ్మరంగా ప్రచారం చేస్తున్న నాయకులకు చంద్రబాబు పర్యటన కొత్త ఉత్సాహాన్ని కలిగించింది. ముఖ్యంగా చంద్రబాబు ప్రసంగంలో ప్రస్తావించిన కొన్ని అంశాలు నియోజకవర్గంలోని తెలుగుదేశం శ్రేణులకు ఊపునిచ్చాయని చెప్పవచ్చు. మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇస్తానని, పెదకూరపాడులో ఐటీ కంపెనీ ఏర్పాటు చేస్తానని చంద్రబాబు చేసిన ప్రకటనలు కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపాయి. పెదకూరపాడు నియోజకవర్గానికి గతంలో అనేక సార్లు వచ్చానని, ప్రజల్లో ఇంత ఉత్సాహాన్ని ఎప్పుడూ చూడలేదని చంద్రబాబు ప్రకటించటం, బీజేపీ, జనసేన, తెలుగుదేశం పార్టీలు క్యాడర్ మొత్తం ఏకమై కార్యక్రమాన్ని విజయవంతం చేయటం నియోజకవర్గంలో మూడు పార్టీల ఐక్యతను చాటింది. సభకు హాజరైన వేలాది మంది ప్రజానీకం చంద్రబాబు నియోజకవర్గానికి ఇచ్చిన హామీలను ప్రశంసిస్తున్నారు. మొత్తం మీద ఐదు మండలాల్లో టీడీపీకి చంద్రబాబు పర్యటన ఉత్సాహాన్ని, జోష్‌ను, కొత్త ఊపును కలిగించాయని చెప్పవచ్చు.

తెలుగుదేశం పార్టీని గెలిపించాలి

దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ


దివ్యాంగులతో మాట్లాడుతున్న మందా కృష్ణమాదిగ

సత్తెనపల్లి, ఏప్రిల్ 7: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని దివ్యాంగులంతా తెలుగుదేశం, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. పట్టణంలోని వెంకటేశ్వర కల్యాణ మండపం వద్ద టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు బస చేసిన ప్రాంతంలో ఆదివారం దివ్యాంగుల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అధ్యక్షతన దివ్యాంగులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న మందా కృష్ణమాదిగ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ దివ్యాంగులకు తీరని అన్యాయం చేశాడన్నారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే దివ్యాంగులకు నెల నెలా రూ.6వేలు పింఛన్ ఇచ్చేలా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ఆయన కోరటంతో ఇందుకు ఆయన సమ్మతించారన్నారు. ముందుగా తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కృష్ణ మాదిగ, గోనుగుంట్ల కోటేశ్వరరావు, సునీల్‌లు చంద్రబాబుకు అందించారు.

ఎమ్మెల్యే శంకరరావును ఓడించటానికే వచ్చాను

అచ్చంపేట, ఏప్రిల్ 7: పెదకూరపాడు **టీడీపీ అభ్యర్థి బాష్యం ప్రవీణ్** ఎమ్మెల్యే నంబూరు శంకరరావును ఓడించటానికే పెదకూరపాడు నియోజకవర్గానికి వచ్చానని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రజాగళం సభకు వచ్చిన అనూహ్య స్పందన చూసి ఎమ్మెల్యే శంకరరావు పిచ్చిపిచ్చిగా పేలుతున్నారన్నారు. శంకరావు రాజకీయ వ్యభిచారం చేస్తున్నారని, ఆయన చేసిన శాండ్, వైన్, మాఫియాల గురించి తెలుసునన్నారు. నియోజకవర్గంలో శంకరరావును ఓడిస్తానన్నారు. చంద్రబాబు ప్రజాగళం సభకు వచ్చిన స్పందన చూసిన శంకరరావుకు గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయన్నారు. టీడీపీలో చేరటం కోసం విశ్వ ప్రయత్నాలు చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. ప్రచారంలో తిరుగుతూ మమ్మల్ని గెలిపిస్తే గెలిచిన తరువాత తెలుగుదేశం పార్టీలోకి వస్తానని చెప్పటం నిజం కాదా? అని బాష్యం ప్రవీణ్ మాట్లాడారు. ఇంకొక సారి చంద్రబాబుపై మాట్లాడితే కార్యకర్తల ఆగ్రహానికి గురవుతారని హెచ్చరించారు. ఓటు రూపంలో నీ అహంకారాన్ని ప్రజలు అణచి వేస్తారన్నారు. ప్రజాగళం సదస్సుకు వచ్చిన స్పందనతో కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తారని తెలిపారు.

వైసీపీకే ఓటు వేయాలి.. లేదంటే చంపేస్తా

● టీడీపీ కార్యకర్తపై గొడ్డలితో దాడి
● గృహాల్లో చొరపడి సామాన్లు ధ్వంసం
● కాకానివారిపాలెంలో వలంటీర్ వీరంగం

కారంపూడి, ఏప్రిల్ 7: పార్టీ మారతారా నా కొడకల్లారా.. మీ అంతు చూస్తా.. అంటూ ఓ వలంటీరు ఊగిపోయాడు.. రాత్రి వేళ ఆవేశంతో ఊగిపోతూ గొడ్డలితో హల్‌చల్ చేస్తూ టీడీపీ గృహాల్లోకి చొరబడి సామాన్లు ధ్వంసం చేశాడు.. అడ్డొచ్చిన టీడీపీ కార్యకర్తపై గొడ్డలితో దాడి చేశాడు.. ఫిర్యాదు చేద్దామని పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే ఎస్ఐ స్పందించలేదు.. ఈ ఘటన కారంపూడి మండలం కాకానివారిపాలెంలో శనివారం రాత్రి జరిగింది. కాకానివారిపాలెంకు చెందిన ఎస్సీ సామాజిక వర్గీయులు సుమారు 50 కుటుంబాలు ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. పార్టీ మారినందుకు కక్షపెంచుకున్న అధికార పార్టీ నేతలు అదే సామాజిక వర్గానికి చెందిన గ్రామ వలంటీర్ వంగల సాగర్‌ను రెచ్చగొట్టి పంపారు. రాత్రి 7 గంటల ప్రాంతంలో సాగర్ గొడ్డలి చేత్తో పట్టుకొని గ్రామంలో దుర్భాషలాడుతూ హల్‌చల్ చేశాడు. ఇంట్లోని టీవీలు, బీరువాలు, మంచాలు, ఫ్యాన్లు తదితర గృహోపకరణాలను ధ్వంసం చేశాడు. అడ్డుకునే ప్రయత్నం చేసిన కడియం నాగరాజు తలపై గొడ్డలితో దాడి చేశాడు. తీవ్ర గాయాలపాలైన నాగరాజు స్థానికంగా చికిత్స తీసుకున్నారు. సుమారు రూ.4 లక్షల ఆస్థినష్టం జరిగింది.

పట్టించుకోని ఎస్ఐ రామాంజినేయులు..

బాధితులు నాగరాజు, అతని కుటుంబసభ్యులతో మరికొందరు మండల కేంద్రమైన కారంపూడిలోని పోలీస్‌స్టేషన్ స్టేషన్‌కు దాదాపు రాత్రి 10 గంటలకు చేరుకున్నారు. రాత్రి 11 గంటలకు కూడా వీరి మొర వినే నాథుడే కరువయ్యారు. ఎస్ఐ రామాంజినేయులుకు ఫోన్లో విషయం తెలిపినా స్పందించలేదు. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్ వద్దనే రాత్రంతా జాగారం చేశారు. ఆదివారం తెల్లవారుజామున పోలీసులు ఫిర్యాదు తీసుకోవడంతో అక్కడి నుంచి గ్రామానికి చేరుకున్నారు. అయితే ఇప్పటికీ వలంటీర్ సాగర్‌పై పోలీసులు కేసు నమోదు చేయనట్లు తెలుస్తోంది. మొదటి నుంచి ఎస్ఐ అధికార పార్టీకి కొమ్ము కాస్తూ టీడీపీ సానుభూతిపరులపై అక్రమ కేసులు బనాయించారనే విమర్శలు ఉన్నాయి.

పాతగణేశునిపాడులో జయహో బీసీ

పిడుగురాళ్ల, ఏప్రిల్ 7: వైసీపీ ఐదేళ్ల పాలనలో బీసీ సామాజిక వర్గంపై దాడులు, అక్రమ కేసులుతో వేధించిన విషయాన్ని బీసీలు గుర్తుంచుకోవాలని పార్టీ మండల కన్వీనర్ గండికోట వెంకటేశ్వర్లు తెలిపారు. పాతగణేశునిపాడు గ్రామంలో ఆదివారం రాత్రి జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీపీ యడ్లపల్లి నారాయణ, మేకల సాంబశివరావు, ముప్పన వెంకటేశ్వర్లు, మక్కెన రాజు, పాదర్తి రాజేశ్వరి తదితరులు మాట్లాడుతూ బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేస్తానని చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రతి ఒక్కరికి ఎంతో మేలు కలుగుతుందన్నారు.

నేడు భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య ప్రచారం

బెల్లంకొండ, ఏప్రిల్ 7: మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో పెదకూరపాడు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య నాగిరెడ్డిపాలెం గ్రామంలో సోమవారం సాయంత్రం ప్రచారం నిర్వహించనున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న డాక్టర్ చదలవాడ అరవిందబాబు

మాజీ జడ్పీటీసీ, మాజీ యార్డు డైరెక్టర్ టీడీపీలో చేరిక

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 7: సార్వత్రిక ఎన్నికల ముందు అధికార వైసీపీకి వరుస దెబ్బలు తగులుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ విధానాలు, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తీరుతో విసుగెత్తిపోయిన ఆ పార్టీ నేతలు.. టీడీపీలోకి వెళ్లేందుకు క్యూ కడుతున్నారు. తాజాగా మాజీ జడ్పీటీసీ సీతామహాలక్ష్మి, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మానుకొండ శ్రీనివాసరావు ఆదివారం టీడీపీలో చేరారు. నరసరావుపేట టీడీపీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు టీడీపీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేల్పుల సింహాద్రి యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి విశేశ్వరావు, మాజీ సర్పంచ్ పి.మల్లికార్జునరావు, ఎల్.లక్ష్మీనారాయణ, దుగ్గి బాబురావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గద్దె నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి గోగులపాడు వైసీపీ నాయకుడు

రొంపిచర్ల, ఏప్రిల్ 7: మండలంలోని గోగులపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ఉయ్యాల వెంకటరావు ఆదివారం టీడీపీలో చేరారు. సత్తెనపల్లిలో జరిగిన టీడీపీ సమీక్షా సమావేశంలో ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి చదలవాడ అరవిందబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో అట్ల చిన వెంకటరెడ్డి, శివ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మోసకారి జగన్‌ను ప్రజలు సాగనంపాలి

● పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఏప్రిల్ 7: జగన్మోహనరెడ్డి లాంటి మోసకారి సీఎంను రాష్ట్ర చరిత్రలో చూడలేదని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. చంద్రబాబు నాయుడు అందించిన పథకాలకు పేర్లు మార్చడం కేంద్ర ప్రభుత్వం పథకాలపై స్టిక్కర్లు వేసుకోవడం మినహా సీఎంగా జగన్మోహనరెడ్డి ప్రజల కోసం కొత్తగా చేసిందేమిటో చెప్పాలన్నారు. రాష్ట్రంలో 2.70లక్షల కోట్ల ప్రజలకు ప్రత్యక్ష నగదు బదిలీ చేశామని ప్రచారం చేసుకుంటున్న జగన్‌రెడ్డి అందులో సగం డబ్బు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిందే అన్న నిజాన్ని ఎందుకు వెల్లడించడం లేదన్నారు. రాష్ట్రంలో నేటికి 89లక్షల రేషన్ కార్డులకు సరుకులు ఇస్తుంది కేంద్ర ప్రభుత్వం అవునో కాదో చెప్పాలన్నారు. పేదలకు పంపిణీచేయమని కేంద్రం ఇచ్చిన 5.25లక్షల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని బొక్కేసిన పందికొక్కులు బియ్యం దొంగలు ఎవరో నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 8రకాల సరుకులు అందిస్తే జగన్ వచ్చాక వాటిని బియ్యానికి పరిమితం చేయడం నిజం కాదా ప్రశ్నించారు. రైతు భరోసా ద్వారా 13500 ఇస్తున్నట్లు బిల్డప్ కొడుతున్న జగన్ అందులో కేంద్రం వాటా రూ.6వేల సంగతిని ఎందుకు ప్రస్తావించలేదని నిలదీశారు. ఐదేళ్లలో చేసిన 12లక్షల కోట్ల అప్పులో సంక్షేమానికి ఇచ్చింది 1.35లక్షల కోట్లు పోగా మిగిలిన డబ్బుంతా ఎవరి జేబుల్లోకి వెళ్ళిందని ప్రశ్నించారు. 2023 సంవత్సరంలో వినుకొండకు వచ్చిన జగన్మోహన్‌రెడ్డి వినుకొండ ప్రాంతంలోని మైనార్టీలకు కాలేజితోపాటు షాదీఖానా, బొల్లాపల్లి మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. వాస్తవాలు గమనించి మోసకారి ముఖ్యమంత్రి జగన్‌ను సాగనంపాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



పురస్కారాలు అందుకున్న వివిధ రంగాల్లోని ప్రముఖులు

ప్రముఖులకు ఉగాది పురస్కారాలు

వినుకొండ, ఏప్రిల్ 7: సంప్రదాయాలు మనసులను కలుపుతుందని, మనుషుల మధ్య ఆత్మీయతలు పెరగడానికి పండుగలు దోహదపడుతాయని వినుకొండ మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి అన్నారు. రోటరీ క్లబ్ వినుకొండ, కళాసాగరిక సాంస్కృతిక సంస్థ సంయుక్తంగా నిర్వహించిన శ్రీక్రోధి ఉగాది ఉత్సవాలను రోటరీ క్లబ్ అధ్యక్షుడు చిరుమామిళ్ళ కోటేశ్వరరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాగ శ్రవణంతోపాటు కవి సమ్మేళనం నిర్వహించి, వినుకొండ ప్రాంతంలోని ప్రముఖులకు ఉగాది పురస్కారాలు అందజేశారు. కామేశ్వరి, డాక్టర్ మన్నెం సాంబశివరావు, డాక్టర్ వహిద, బీవీ నాగేశ్వరరావు, గంగినేని రాఘవ, యార్లగడ్డ చంద్రశేఖర్‌ఆజాద్, ముత్తినేని గిరి, వెంకరెడ్డి, నరసింహరావు దంపతులు స్వాతి, ప్రతిమ సునీల్ తదితరులు పురస్కారాలు అందుకున్న వారిలో ఉన్నారు. కార్యక్రమంలో కవి కరిముల్లా, రమేష్, కమలారాం, స్టార్ వలి, గుత్తా గుర్నాథం, నాయి రసూల్, రోటరీ సభ్యులు శ్రీనివాసరావు, కరిముల్లా, కళాసాగరిక సభ్యులు సదాశివరావు, కోటి, కూచి రామాంజనేయులు, చిరంజీవి, మోక్షశ్రీ, హర్షిణి తదితరులు పాల్గొన్నారు.

మోటర్ బైక్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

వినుకొండటౌన్, ఏప్రిల్ 7: కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని పార్వపురం గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. వినుకొండ ద్విచక్ర వాహనంపై పెయింటింగ్ పనులు వెళ్తున్న సి.హెచ్.సురేష్, డి.మహేష్‌లను వెనుక వైపు నుంచి కారు బలంగా ఢీ కొనడంతో తీవ్ర గాయాలైయ్యాయి. సంఘటన ప్రాంతంలో అపస్మారక స్థితిలో పడి వీరిద్దరిని 108 సాయంతో వినుకొండలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం సురేష్‌ను మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. జరిగిన సంఘటనపై పోలీసులను వివరణ కోరగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

వైభవంగా మాస శివరాత్రి పూజలు

రొంపిచర్ల, ఏప్రిల్ 7: మండలంలోని విప్పర్ల గ్రామంలోని వల్లభేశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రి పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకం పూజలను అర్చకులు చందలూరి పరమేశ్వరరావు నిర్వహించారు. పార్వతీదేవి అమ్మవారి కుంకుమ పూజలను నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.



ప్రత్యేక అలంకరణలో వల్లభేశ్వర స్వామి

మోర్ సెంటర్‌లో అక్రమ మద్యం స్వాధీనం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 7: పట్టణ నడిబొడ్డు మోర్ సెంటర్‌లో అక్రమ మద్యం స్థావరంపై మొదటి పట్టణ పోలీసులు దాడులుచేసి ఆదివారం మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసినట్టు సీఐ సీహెచ్ కృష్ణారెడ్డి తెలిపారు. తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టణంలోని మోర్ సెంటర్‌లో సత్తెనపల్లికి చెందిన ఎస్.రామిరెడ్డి, ఆర్ ప్రకాష్, గుంటూరుకు చెందిన సీహెచ్ మహేష్, పట్టణానికి చెందిన షేక్ మౌలాలిలు అక్రమ మద్యం కలిగి ఉన్నట్టు గమనించామన్నారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా సుమారు రూ.59,600 విలువైన 42 మద్యం సీసాలను అప్పగించారన్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

టీడీపీ మండల ప్రధాన కార్యదర్శిగా అనంత రామయ్య

రొంపిచర్ల, ఏప్రిల్ 7: మండలంలోని వడ్లమూడివారిపాలెం గ్రామానికి చెందిన లింగా అనంత రామయ్య మండల తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధిగా ఎంపికయ్యారు. తన నియామకానికి కృషిచేసిన ఎమ్మెల్యే అభ్యర్థి చదలవాడ అరవింద బాబు, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, మండల టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీనివాసరావుకు కాపు సంఘం అభినందనలు

వినుకొండటౌన్, ఏప్రిల్ 7: వినుకొండ నియోజకవర్గ కూరగాయల మార్కెట్ అధ్యక్షుడిగా ఎంపికైన సుంకరి శ్రీనివాసరావును నియోజకవర్గ కాపు సంఘం నాయకులు ఆదివారం ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టి.బ్రమ్మం, ఎస్.ప్రసాద్, జి.పెద్దన్న, రామ్మోహనరావు, రామారావు, సి.శ్రీనివాసరావు, ఎ.రాములు, పి.వెంకటేశ్వర్లు, కె.రాంబాబు, ఎస్.నాగేశ్వరరావు, ప్రసన్న, శ్రీనివాసరావులతోపాటు కాపు నాయకులు, కూరగాయాల వర్తక సంఘం నాయకులు పాల్గొన్నారు.

105 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెన

వినుకొండ, ఏప్రిల్ 7: బొల్లాపల్లి మండలంలోని పలు గ్రామాల నుంచి వైసీపీ నుంచి పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఆధ్వర్యంలో సుమారు 105 కుటుంబాలు ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరినవారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బొల్లాపల్లి మండలంలోని బొల్లాపల్లి, గంగుపల్లి, పలుకూరు, రామాపురం, శోమ్లవాగుతండ, వెల్లటూరు నుంచి పెద్ద సంఖ్యలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జీవీ అంజనేయులు మాట్లాడుతూ పల్నాడు ప్రాంతాన్ని ఎండబెట్టి ఇక్కడ ప్రాజెక్టులన్నీ గాలికి వదిలి ఇచ్చిన హామీల్లో ఒక్కటి అంటే ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నిర్వాకాల వలనే వైసీపీ నాయకులంతా ప్రజలకు సమాధానం చెప్పుకోలేని దుస్థితిలో పడ్డారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జరపాల గోవిందనాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు హనుమానాయక్, పెమ్మసాని నాగేశ్వరరావు, పెసల వెంకటనారాయణ, పి.వెంకటేశ్వర్లు, అర్ధలపూడి శ్రీనివాసరావు, ఆళ్ళ నన్నయ్య హనుమానాయక్, ఎలిశెట్టి రంగయ్య, నిమ్మకాయల సుబ్బారావు, కొండలు తదితరులు పాల్గొన్నారు.

14వ వార్డు నుంచి టీడీపీలోకి ...

వినుకొండ టౌన్, ఏప్రిల్ 7: రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న కష్టాలు తీరాలంటే తెలుగుదేశం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు సతీమణి, శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి అన్నారు. ఆంధ్ర ఆడపడుచులందరికి పెద్దన్నగా చంద్రబాబు నాయుడు తీసుకువస్తున్న సూపర్ సిక్స్ పథకాలతో మహిళలు మరింత సంతోషంగా ఆత్మగౌరవంతో జీవించే రోజులు అతి త్వరలో రానున్నాయని ఆమె జోస్యం చెప్పారు. పట్టణంలోని 14వ వార్డులో వైసీపీ నుంచి సుమారు 25కుటుంబాలు లీలావతి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఈ సందర్భంగా పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ త్వరలో జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం రాబోతుందని ఆమె తెలిపారు. తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరికి ఆంజనేయులు అండదండలుగా ఉంటారని ఆమె హామీ ఇచ్చారు. వార్డుల్లో చాలా సమస్యలు ఉన్నాయని స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారని అధికారంలోకి రాగానే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తాగునీరు, డ్రెయినేజీ సమస్యతో ప్రధానంగా ఈ ప్రాంతంలోని మహిళలు తీవ్ర ఇబ్బందులు స్వయంగా చూశామని వాటిని త్వరలో పరిష్కారం చేస్తామన్నారు. జీవీ ఆంజనేయులుతోపాటు, ఎంపీ అభ్యర్థి లావు కృష్ణదేవరాయులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. పిడతల వెంకట పెదరంగయ్య, దుర్గ, మహేష్, సీతారాజుపల్లి మహికంత, మేజర్ల తిరుపతమ్మ, పోసా నారాయణ, అంజి, వెంకటేశ్వర్లు, రాగ నాగేశ్వరరావు, ఆర్య వెంకటరావు, అనిల్, శ్రీనివాసరావు తదితరులు టీడీపీ చేరారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

వినుకొండ టౌన్, ఏప్రిల్ 7: పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో భారతీయ జనతాపార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ జనతాపార్టీ వ్యవస్థాపకులు పండిట్ దీన్‌దయాల్ ఉపధ్యాయ, శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటాలకు పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతోపాటు మక్కెన మల్లికార్జునరావులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ యార్లగడ్డ లెనిన్‌తోపాటు జిల్లా నాయకులు మేడం రమేష్, సత్యనారాయణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

● జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ లోతేటి



నరసరావుపేట పట్టణంలో బైక్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 7: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని మే 13వ తేదీ జరగనున్న పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి లోతేటి శివశంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ఎస్ఎస్ఎన్ కళాశాల వరకు ఓటర్ల అవగాహనకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. నరసరావుపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, స్వీప్ నోడల్ అధికారి నాగిని పరిధిలో ఏర్పాటుచేసిన ఈ బైక్ ర్యాలీని కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం తదితరులు ప్రారంభించారు. తొలుత జెండా ఊపి కలెక్టర్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేలా ఓటరు నమోదు కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరుస్తూ అర్హులైన అందరిని ఓటరుగా నమోదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. పోలింగ్ రోజున ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటిస్తుంది కనుక ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటర్లకు అందుబాటులోనే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పోలింగ్ శాతాన్ని పెంచాలని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మన హక్కులను ఎలా ప్రశ్నిస్తామో.. అదేవిధంగా అర్హులైన ప్రతి ఒక్కరూ మే 13వ తేదీన ముందుకు వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవడానికి, ఓటర్లలో విశ్వాసాన్ని పెంపొందించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే కేంద్ర బలగాలు ఆధ్వర్యంలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల ప్రాంతాల్లో పోలీస్ కవాతు ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎటువంటి భయం లేకుండా నిర్భయంగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసుకోవచ్చు అని తెలిపారు. జిల్లావ్యాప్తంగా చెక్ పోస్టులు ఏర్పాటుచేసి, నిఘా పెట్టడం జరిగిందన్నారు. ఓటర్లను ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం, డబ్బు, మద్యం, తదితర వాటిని సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఓటర్లు పెద్దఎత్తున పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయాలని విజ్ఞప్తిచేశారు. పల్నాడు జిల్లాలో నూరుశాతం పోలింగ్ జరిగేందుకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు నమోదు అవగాహన (స్వీప్ యాక్టివిటీ) కార్యక్రమంలో భాగంగా ఓటర్లను చైతన్యపరచటం, ఓటర్ నమోదు ప్రక్రియపై అవగాహనకు ఈ బైక్‌ర్యాలీని నిర్వహించామన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు మేరకు మే 13న పోలింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలందరూ మే 13 వ తేదీని సెలవు దినంగా చూడకుండా బాధ్యతయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అధికారులు నగర ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు.



చంద్రబాబు నాయుడును కలిసిన పారా లక్ష్మయ్య

టీడీపీలో చేరిన పారా లక్ష్మయ్య

సత్తెనపల్లి, ఏప్రిల్ 7: వినుకొండ నియోజకవర్గం నూజెండ్ల మం డలం కొత్తజెడ్డావారిపాలెంకు చెందిన విద్యావేత్త డాక్టర్ పారా లక్ష్మ య్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ వ్యవస్థాపకులు డాక్టర్ పారా లక్ష్మయ్య ఆదివారం సత్తెనపల్లి పట్టణంలోని శ్రీవెంకటేశ్వర కల్యాణ మండపం వద్ద టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సమ క్షంలో టీడీపీలో చేరారు. చంద్రబాబునాయుడు ఆయనకు పార్టీ కం డువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పల్నాడు జిల్లాలో తెలుగుదేశం అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని లక్ష్మయ్య తెలి పారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజ నేయులు, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిలు ఉన్నారు.

చంద్రబాబును కలసిన గోనుగుంట్ల

రొంపిచర్ల, ఏప్రిల్ 7: సత్తెనపల్లి పర్యటనలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆదివారం కలిశారు. తెలుగుదేశం పార్టీ సమీక్షా సమావేశం సందర్భంగా చంద్రబాబును కలసి నరసరావుపేట నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై మాట్లాడారు. నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో ఎంపీతో సహా అన్ని స్థానాల్లో టీడీపీ గెలుపొందుతుందని వివరించారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.



సన్మానం అనంతరం పీఠాధిపతులు, కళాకారులతో శాంతి ఆశ్రమ వ్యవస్థాపకుడు హిమాలయ గురువు

పీఠాధిపతులు, కళాకారులతో ఆత్మీయ సమ్మేళనం

వినుకొండ, ఏప్రిల్ 7: మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ సమీపంలోని శాంతి ఆశ్రమ ట్రస్టు ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బజన బృంద గురువుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం వినుకొండలో జరిగింది. సనాతన ధర్మ పరిరక్షణ కోసం అంతరించిపోతున్న కళలను పునఃరుద్ధరించడానికి కంకణబద్ధులైన బజన, కళాకారుల బృందాలను గురువులను హిమాలయ గురువు ఘనంగా సన్మానించారు. శ్రీశ్రీ విజయశంకరస్వామి అన్నమయ్య జానపద కళాక్షేత్ర పీఠాధిపతులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నలుమూలల నుంచి కార్యక్రమంలో పాల్గొన్న భజన బృందాలు, కోలాట బృందాల కళాకారులకు ట్రస్టు ద్వారా వారికి జ్ఞాపికను అందించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు పెండేల పుల్లారావు, మోహనరావు, సుదాకర్, కోటేశ్వరరావు, కాశి, సురేష్, దామోదరరావు, రమేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కమ్మవారి అన్నదాన సత్రానికి విరాళాలు

బొందిలిపాలెం (శావల్యాపురం) ఏప్రిల్ 7: మండలంలోని శానంపూడి శివారు బొందిలిపాలెంలోని అడవి పేరంటాలమ్మ దేవాలయం వద్ద ఈ నెల 9వ తేదీన జరగనున్న తిరునాళ్ళ వేడుకల్లో భాగంగా ఆలయ ఆవరణలోని శ్రీకాకతీయ కమ్మవారి అన్నదాన సత్రంలో జరగనున్న అన్నదాన కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల నుంచి దాతలు విరాళాలు సమర్పించినట్లు వ్యవస్థాపక కమిటీ సభ్యులు నాగబడి వీరనారాయణ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మతుకుమల్లికి చెందిన ఆలూరి వెంకట నరసయ్య మిత్రబృందం గటిగంటి మురళీకృష్ణ, బోళ్ళ రవిప్రసాద్‌లు రూ.30,116, వేల్పూరుకు చెందిన చింతా వెంకట గిరిబాబు రూ.30,116, మతుకుమల్లికి చెందిన చింతా రమణారావు రూ.20,116, చిన్న కంచెర్లకు చెందిన దావులూరి శ్రీనివాసరావు (బ్రిటీష్) రూ.15,116, కనమర్లపూడికి చెందిన నామినేని సుభాన్‌రావు రూ.10,116, పోట్లూరుకు చెందిన యలవర్తి చిన్న వెంకటేశ్వర్లు రూ.10,116, గుంటుపాలెంకి చెందిన శ్రీరామ్ యూత్ కమిటీ సభ్యులు రూ.10,116లను విరాళాలుగా సమర్పించినట్లు తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి స్వచ్ఛందంగా తమవంతు సహాయ, సహకారం అందించిన దాతలకు కమిటీ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలను తెలియజేశారు.



ప్రత్యేక అలంకరణలో పేరంటాలమ్మ, పేరయ్య దంపతులు, అమ్మవారిని దర్శించుకొన్న రిటైర్డ్ జడ్జి లక్ష్మీవరప్రసాద్

రేపు అడవి పేరంటాలమ్మ తిరునాళ్ళ

బొందిలిపాలెం (శావల్యాపురం) ఏప్రిల్ 7: మండలంలోని శానంపూడి శివారు బొందిలిపాలెంలోని అడవి పేరంటాలమ్మ దేవాలయంవద్ద తిరునాళ్ళ మహోత్సవాన్ని ఈ నెల 9వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం వివిధ గ్రామాల మహిళలు తరలివచ్చి అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో పొంగలి వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పసుపు, కుంకుమలు, చీరెసారెలను కానుకగా సమర్పించి మొక్కుబడులు తీర్చుకొన్నారు. రిటైర్డ్ సివిల్ కోర్టు జడ్జి గుడిపాటి లక్ష్మీవరప్రసాద్ కుటుంబసభ్యులతో విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ సోమేపల్లి వీరాంజనేయులు ఆయన్ని సాదరంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఆలయపూజారి రవణయ్య భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కాపు, బలిజ సంక్షేమ సేన అధ్యక్షుడి వెంకటేష్

వినుకొండ టౌన్, ఏప్రిల్ 7: వినుకొండ నియోజకవర్గ కాపు బలిజ సంక్షేమ సేన అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా యాదాల వెంకటేష్, నారిశెట్టి మహేష్‌లను గుంటూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బండికల్లు శ్యామ్ ప్రసాద్ నియమించారు. గుంటూరులో జరిగిన కాపు, బలిజ సంక్షేమ సేన ఆత్మీయ సమావేశంలో ఆదివారం వారిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని పట్టణంలోని పలువురు కాపు నాయకులు వారికి అభినందనలు తెలిపారు.

జగన్ తీరు మారకపోతే వైసీపీ ఖాళీ

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 7: పట్టణంలోని 7వ వార్డుకు చెందిన వైసీపీ కార్యకర్తలు 18కుటుంబాలు ప్రత్తిపాటి నివాసంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ప్రత్తిపాటి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ తీరు మారకపోతే వైసీపీ ఖాళీ అవుతుందని, వైసీపీలో ఉన్న అభ్యర్థులు కూడా మిగిలే పరిస్థితి లేదని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఏం చేశారని అడిగితే ప్రజలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితుల్లో వందల మంది నాయకులు, వేలాది మంది కార్యకర్తలు అధికారపక్షాన్ని వీడుతున్న ముఖ్యమంత్రికి తత్వం బోధపడటం లేదన్నారు. సొంత కుటుంబంలో ఐదుగురి చేతుల్లోనే పార్టీని, ప్రభుత్వాన్ని పెట్టిన జగన్ మిగిలిన ఏ వర్గానికి కనీస గౌరవ మర్యాదలు లేకుండా చేశారన్నారు. గత ఎన్నికల్లో సైకో జగన్‌కు మద్దతు ఇచ్చి చేసిన పొరపాటును కొంతైనా సరిదిద్దుకోవాలనే ఉద్దేశంతో ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరికలు కొనసాగుతున్నాయన్నారు. వారందరి నమ్మకాన్ని నిలబెట్టుకోనేలా ఎన్నికల అనంతరం ప్రజాపాలన ఉంటుందని, చంద్రబాబు ఇస్తున్న హామీలే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు.



ఇఫ్తార్‌లో పాల్గొన్న మాజీమంత్రి ప్రత్తిపాటి

వంకాలయపాడులో ఇఫ్తార్

వంకాయలపాడు (యడ్లపాడు), ఏప్రిల్ 7: మండలంలోని వంకాయలపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు షేక్ సుభాని తన నివాసంలో శనివారం రాత్రి ఇఫ్తార్ ఏర్పాటుచేశాడు. కార్యక్రమానికి మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని ఇఫ్తార్‌ను ప్రారంభించారు. ముస్లిం సోదరులకు స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముస్లింల ఉన్నతికి, సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ నిరంతరం కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కందిమళ్ళ రఘురామారావు, పోపూరి రమేష్, పుటిగంపు వెంకటేశ్వరరావు, ఉప్పలపాటి సీతారామయ్య, షేక్ నాగూర్‌వలి, దివ్వె కోటేశ్వరరావు, వెంకటకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

పని వేతనం కోసం కార్మికుల ధర్నా



గేటు బయట ధర్నా చేస్తున్న కార్మికులు

నాదెండ్ల, ఏప్రిల్ 7: చేసిన పనులకు సంబంధించి వేతనం చెల్లించాలంటూ గణపవరం గ్రామంలో ధర్నాచేసి నిరసన తెలిపారు. కంపెనీ గేటుకు తాళంవేసి వారు తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ నిరసనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గణపవరంలోని ఒక కంపెనీని అద్దెకు తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం తరపున రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే పనులను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం తరుపున విక్రాన్ కంపెనీ వారు ఈ బాధ్యత తీసుకున్నారు. ఆ కంపెనీ తరుపున విద్యుత్ మీటర్లను బాక్సుల్లో పెట్టి ఫిట్ చేసే బాధ్యతను రెండు కంపెనీలకు సబ్ కాంట్రాక్ట్‌గా ఇచ్చారు. విజయవాడకు చెందిన వాసుదేవ, సాంబశివ కంపెనీ వారు మీటరును బాక్సులో పెట్టి సిద్ధం చేసేందుకు ఒక్కొక్క మీటరుకు రూ.60 ఇచ్చేలా సబ్ కాంట్రాక్టు పొందిన వాసుదేవ కంపెనీ వారు కార్మికులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనిలో భాగంగా సుమారు 30 మంది నెలన్నర కాలం వరకు అక్కడే ఉండి మీటర్లు ఫిట్ చేసే పనులు చేశారు. మెటీరియల్ లేదంటూ నెలన్నర క్రితం పనులను ఆపారు. ఐతే కార్మికులకు మాత్రం చెల్లించాల్సిన పనివేతనం సుమారు రూ.1.53 లక్షలు చెల్లించలేదు. ఆ మొత్తం కోసం వారు వాసుదేవ కంపెనీ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోక పోవటంతో గేటుకు తాళంవేశారు. తమకు రావాల్సిన సొమ్ము చెల్లించకపోతే కుటుంబాలను ఎలా పోషించు కోవాలంటూ వారు ప్రశ్నిస్తున్నారు.

20 నుంచి చౌక్‌బాల్ రాష్ట్ర జట్టులకు శిక్షణ

చిలకలూరిపేట, ఏప్రిల్ 7: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చౌక్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఏపీ బాల బాలికల జట్లకు శిక్షణ శిబిరం ఈ నెల 20 నుంచి పట్టణంలోని మోడరన్ గ్రీన్‌వ్యాలీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ చైర్మన్ చేబ్రోలు మహేష్, కార్యదర్శి ఎస్ సుధాకరరావు ఆదివారం తెలిపారు. ప్రతిభ కనబరిచిన 12మంది బాల బాలికలు ఈ శిక్షణ శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. ఈ నెల 26 నుంచి 28 వరకు పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని వారు తెలిపారు. మహిళా కోచ్‌గా వెంకట లక్ష్మి ప్రసన్న, బాలుర కోచ్‌గా సురేష్ వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా చౌక్‌బాల్ సెక్రటరీ వై పిలిప్‌రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్, మనోహర్, అమీర్ హుస్సేన్ గురునాథ్, కృపారావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులాల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం

చిలకలూరిపేట, ఏప్రిల్ 7: చిలకలూరిపేట నియోజకవర్గ బీసీ కులాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. మూడువేల మందితో త్వరలో బీసీ గర్జన సభ జరుపుతామని ఆయా కులాల నాయకులు ప్రకటించారు. ఎన్నికల్లో బీసీ అభ్యర్థుల గెలుపు కోసం ఉమ్మడిగా కృషి చేద్దామని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవుళ్ళ వెంకట్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. రాజకీయాలకు అతీతంగా బీసీ అభ్యర్థులు ఎవరు ఉన్నా గెలిపించుకుందామని ఆయన అన్నారు. గతంలో కేటాయించిన బీసీ భవన్ స్థలాన్ని ఆక్రమణదారులనుంచి కాపాడుకొని బీసీ భవన్ నిర్మాణాన్ని చేపడదామన్నారు. సమావేశానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మాదాసు పృధ్వీరాజ్‌సాయి అధ్యక్షత వహించారు. సమావేశంలో ఉప్పాల భాస్కరరావు, పేపలి వాసులు, అవ్వారు అవ్వన్న, శివకోటి అక్కయ్య, గౌరు లక్ష్మయ్య జెట్టి బాలయ్య, గాజుల వెంకట శివ, చేతరాజుపల్లి సాంబశివరావు, షేక్ సింగరయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన నూతన దంపతులు

యడ్లపాడు, ఏప్రిల్ 7: కులాంతర వివాహం చేసుకున్న ప్రేమజంట పెద్దల నుంచి తమకు రక్షణ కల్పించాలంటూ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడు మండలం సొలస గ్రామానికి చెందిన ప్రేమికులు గత నెల 29న ఊరు విడిచివెళ్ళారు. దీనితో యువతి తల్లి తన కుమార్తె కనిపించడం లేదంటూ ఈ నెల 2న యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. పోలీసులు మిస్సింగ్ నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్న క్రమంలో సదరు ప్రేమజంట పెళ్లిచేసుకుని ఆదివారం యడ్లపాడు స్టేషన్‌కు వచ్చారు. మేజర్లమైన తాము ఒకరినొకరు ఇష్టపడి వివాహం చేసుకున్నట్లు పోలీసులకు వివరించి కుటుంబ పెద్దల నుంచి రక్షణ కల్పించాలని పోలీసులను వేడుకున్నారు. దీనితో పోలీసులు యువతి తల్లిని స్టేషన్‌కు పిలిపించి నూతన దంపతులతో మాట్లాడించారు. తాము కలసి జీవించడానికి నిర్ణయించుకున్నామని దంపతులు వెల్లడించారు.

ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

వినుకొండ టౌన్, ఏప్రిల్ 7: నూతన సంవత్సర శ్రీకోధి నామ ఉగాది నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మిత్తింటి కృష్ణాంజనేయులు మాట్లాడుతూ నూతన సంవత్సరం అనగానే ఉగాది నుంచి ప్రారంభమవుతుందని కానీ పాశ్చాత్య సంస్కృతికి అలవాటుపడి నూతన సంవత్సరం అంటే జనవరి 1 భావించి నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్నామని ఈ సంస్కృతిని విడనాడి సంస్కృతి సంప్రదాయాలను ప్రజలందరు పాటింపచేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉగాది పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో ప్రతి ఒక్కరూ జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పెనుగొండ రమేష్, కన్నెగండ్ల అనంతకోటేశ్వరరావు, నేరళ్ళ వెంకట పాపారావు, వెంకట శ్రీనివాసరావు, కోటా వెంకట ప్రకాశబాబు, ఆర్యవైశ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.